VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23

visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 24 విశాఖపట్నం, 28 అక్టోబరు 2023 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00




Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

## న్యాయపరమైన అన్ని అంశాలను పరిశీలిస్తున్న భారత ప్రభుత్వం



### పాక్ కుట్రలతోనే అక్రమ కేసులు పెట్టిన ఖతార్ ప్రభుత్వం
### ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేశారన్న ఆరోపణలు సత్యదూరం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఖతార్‌లోని దోహాలో నెలలముందు అరెస్టయిన ఎనిమిదిమంది భారత మాజీ నేవీ అధికారులకు గూడచర్యం ఆరోపణలపై నిన్న ఆ దేశంలోని ప్రాథమిక కోర్టు మరణ శిక్ష విధించడం జరిగింది.

మరణశిక్ష విధించబడిన 8 మంది మాజీ నేవీ అధికారులలో ఒకరయిన కమోడోర్ సుగుణాకర్ పాకాల కుటుంబ సభ్యులు, స్నేహితులు విశాఖపట్నంలో బిజెపి రాజ్యసభ ఎంపి జీవీఎల్ నరసింహారావును కలిసి సహాయం అర్ధించారు.

గూఢచర్యం యొక్క నిరాధారమైన ఆరోపణలపై మాజీ భారతీయ నావికాదళ అధికారులను అరెస్టు చేసిన 14 నెలల తర్వాత దిగ్భ్రాంతికరంగా "కతార్‌లోని ప్రైమరీ ఇన్‌స్టాన్స్ కోర్టు" వారికి మరణశిక్షను విధించింది.

తనను సంప్రదించిన కొన్ని గంటలలోపే, ఎంపీ జీవీఎల్ నరసింహారావు విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ గారితో, ఖతార్‌లోని భారత రాయబారి విపుల్‌తోనూ మాట్లాడడం జరిగింది.

ఈ నేపథ్యంలో వారి బంధువులు జీవీఎల్‌ను సహాయం కోసం అర్ధించగా విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జీవీఎల్ వివరాలను తెలుసుకొని విదేశాంగ మంత్రితో, ఖతర్ లో భారత రాయబారితో మాట్లాడడం జరిగింది.

ఖతార్లోని కోర్టు ఇచ్చిన తీర్పు వివరాలను, తదుపరి చట్టపరమైన ప్రక్రియను ఎంపీ జీవీఎల్ నరసింహారావు వెల్లడిస్తూ, ఈరోజు రెండు లైన్ల ఉత్తర్వును మాత్రమే

(మిగతా 2లో)

## రాష్ట్ర గవర్నర్‌కి విమానాశ్రయంలో ఘన స్వాగతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కు విశాఖపట్నం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది.

శనివారం ఏ.ఎం.సిలో జరగనున్న శతాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ శుక్రవారం సాయంత్రం విశాఖపట్నంకు చేరుకున్నారు. జిల్లాకు విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో జిల్లా ఇన్ చార్జి మంత్రి విడదల రజని, నగర మేయరు గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ జి.సుబద్ర, జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున,

పోలీస్ కమీషనర్ ఎ.రవిశంకర్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, తదితరులు గవర్నర్ కు పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

## నన్ను అంతమొందించే కుట్ర జరుగుతోంది



అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఏసీబీ కోర్టు జడ్జికు లేఖ రాశారు. జైలు అధికారుల ద్వారా ఏసీబీ జడ్జికి చంద్రబాబు లేఖ పంపారు. ఈ నెల 25న జడ్జికి టీడీపీ అధినేత లేఖ రాశారు. తన భద్రత, ఆరోగ్యంపై అనుమానాలు, ఆందోళన వ్యక్తం చేస్తూ చంద్రబాబు మూడు పేజీల లేఖ రాశారు.

**చంద్రబాబు లేఖలోని అంశాలు ఇవే...**

"నాకు జెడ్ ప్లస్ సెక్యూర్టీ ఉంది. నేను జైల్లోకి వచ్చినప్పుడు అనధికారికంగా నన్ను వీడియోలు.. ఫొటోలు తీశారు. ఆ ఫుటేజ్‌ను స్వయంగా పోలీసులే లీక్ చేశారు. నా రెప్యూటేషన్‌ను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజ్ రిలీజ్ చేశారు. నన్ను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారు. దీనికి సంబంధించిన లేఖను తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి ఈ విషయమై లేఖ కూడా వచ్చింది. ఆ లేఖపై ఇప్పటి వరకు పోలీస్ అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదు" అంటూ చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు.

**జైలులో భద్రతపై...**

రాజమండ్రి సెంట్రల్ జైలులో తన భద్రతపై కూడా చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు. "ఎస్ కోటకి చెందిన ఓ ముద్దాయి జైల్లో పెన్ కెమెరాతో విజువల్స్ తీస్తున్నారని నా దృష్టికి వచ్చింది. నా కదలికల కోసం జైలుపై అనధికారికంగా డ్రోన్లు ఎగరేస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్న వాళ్లే ఈ డ్రోన్లు ఎగరేశారని భావిస్తున్నాను. డ్రోన్లు ఎగరేసిన ఘటనలోనూ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. ఈ నెల 6న నన్ను కలవడానికి నా కుటుంబసభ్యులు వచ్చిన సందర్భంలో సెంట్రల్ జైలు మెయిన్ గేట్ వద్ద మరో డ్రోన్ ఎగరేశారు. నా భద్రతే కాదు.

(మిగతా 2లో)

## త్వరలో నేర చట్టాల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం: అమిత్‌షా



హైదరాబాద్: వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా అన్నారు. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలని చెప్పారు. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో 75వ బ్యాచ్ ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. 175 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శిక్షణ పూర్తిచేసుకోవడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రైనీ ఐపీఎస్‌ల నుంచి ఆయన గౌరవవందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడారు.

"మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు లభించాయి. కర్తవ్య నిర్వహణలో అమరవీరుల బలిదానం ప్రేరణ కావాలి. వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయి. క్రిప్టో కరెన్సీతో దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనానికి యత్నిస్తున్నారు. హవాలా,

(మిగతా 2లో)

## అడిషనల్ డిఎంహెచ్‌ఓగా పదోన్నతి పొందిన డాక్టర్ కే. రత్న కుమార్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేజీహెచ్ క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ) డాక్టర్ కే.రత్నకుమార్ కాకినాడ జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఓ గా పదోన్నతి పొందారు. కేజీహెచ్ లో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్( సిఎంఓ) గా సేవలందించిన డాక్టర్ కే రత్నకుమార్ కు ఇటీవల కాకినాడ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇంతే కాకుండా

(మిగతా 2లో)

## స్థాయి సంఘం సమావేశంలో అన్ని అంశాలు ఆమోదం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం శుక్రవారం స్టాండింగ్ కమిటీ ఛైర్ పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జివిఎంసి స్థాయి సంఘ సమావేశ మందిరంలో నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ స్థాయి సంఘం అజెండాలో 52 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండా అంశాలు పొందుపరచగా మొత్తంగా 56 అంశాలను స్థాయి సంఘ సభ్యులు చర్చించి ఆమోదించడమైనదని ఛైర్ పర్సన్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.11.16 కోట్ల అభివృద్ధి పనులకు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి పలు సందర్భాల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య కార్మికులు ఏర్పాటు కొరకు సుమారు. రూ.44.06

(మిగతా 2లో)

## ఓటరు జాబితాలో అభ్యంతరాల పరిశీలన ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రత్యేక సంక్షిప్త సవరణలో భాగంగా నిర్వహించిన ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ ఈ నెల 27న జరిగిందని, వాటిలో అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల ముసాయిదా ప్రచురణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శుక్రవారం ఉదయం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 19 లక్షల 15 వేల 682 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 9 లక్షల 51వేల 11మంది పురుషులు, 9 లక్షల 64 వేల 538 మంది మహిళలు, 133 మంది థర్డ్ జెండర్ ఉన్నట్లు వివరించారు. ప్రచురణ అయిన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతులను గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు అందజేయడం జరుగుతుందని, అలాగే సంబంధిత పోలింగు కేంద్రం వద్ద, బూత్ లెవల్ అధికారి, మండల తహశీల్దారు, కలెక్టరు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ తెలిపారు. ఓటరు లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించు కోవాలని, వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరి చేసుకునే అవకాశం ఉందని, ముసాయిదా లోని క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27 నుండి డిసెంబరు 9 వరకు స్వీకరించడం జరుగు తుందని తెలిపారు. అభ్యంతరాలను డిసెంబరు 26 నాటికి పరిష్కరించడం జరుగు తుందని 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నవంబర్ 4, 5 తేదీల్లో మరియు డిసెంబర్ 2, 3 తేదీల్లో (శని, ఆదివారాలు) ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగు తుందని, అందులో కూడా తమ అభ్యంతరాలను స్వీకరించడం జరుగు తుందన్నారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేస్తే వాటిని సరిదిద్దుటకు చర్యలు తీసుకోవడం జరుగు తుందని, తుది జాబితా తదుపరి

(మిగతా 2లో)



## (మొదటి పేజీ తరువాయిలు)

### న్యాయపరమైన అన్ని అంశాలను పరిశీలిస్తున్న భారత ప్రభుత్వం

కోర్టులో చదివిందని, పూర్తి తీర్పు ఆదివారం నాటికి అందుబాటులోకు వస్తుందనీ తెలిపారు.

నేరం అరోపించబడిన వారికి తీర్పుపై 15 రోజులలోపు "కోర్ట్ అఫ్ అప్పీల్"లో అప్పీల్ చేసే అవకాశం ఉంటుంది. కోర్ట్ అఫ్ అప్పీల్ తీర్పు తర్వాత, ఖతార్‌లో అత్యున్నతమైన "కోర్టు అఫ్ కాసేషన్" ప్రక్రియ కూడా ఉంటుందని జీవీఎల్ తెలిపారు తెలిపారు.

భారతీయ మాజీ సైనికాధికారులకు న్యాయం జరిగేలా భారత ప్రభుత్వం, ప్రత్యేకించి విదేశాంగ మంత్రిత్వ శాఖ అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని విదేశాంగ వ్యవహారాల కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కూడా అయిన ఎంపి జీవీఎల్ నరసింహారావు తన చర్యల ఆధారంగా పేర్కొన్నారు.

### నన్ను అంతమొందించే కుట్ర జరుగుతోంది

నా కుటుంబ సభ్యులకు ప్రమాదం పొంచి ఉందనే ఆందోళనతో ఉన్నా. నాలుగున్నరేళ్ల కాలంలో నాపై వివిధ సందర్భాల్లో అధికారంలో ఉన్న వాళ్లు దాడులు చేశారు..

'' నేను జైలుకు వచ్చినప్పుడు అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీశారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజ్ రిలీజ్ చేశారు. నన్ను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారు. కుట్రపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి లేఖ కూడా వచ్చింది. ఆ లేఖపై ఇప్పటి వరకు పోలీసు అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదు. జైలులో అనేక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు దుర్మార్గులు జైలులోకి గంజాయి ప్యాకెట్లు విసిరారు. తోటలో ఉన్న కొంతమంది ఖైదీలు గంజాయిని పట్టుకున్నారు. ఖైదీల్లో 750 మంది తీవ్ర నేరాలకు పాల్పడినవారు ఉన్నారు. కొంతమంది ఖైదీల వల్ల నా భద్రతకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. ఈనెల 6న జైలు ప్రధాన ద్వారం మీదుగా డ్రోన్ ఎగురవేశారు. ములాఖత్‌లో నన్ను కలిశాక వారి చిత్రాల కోసం డ్రోన్ ఎగురవేశారు. నాతోపాటు నా కుటుంబసభ్యులకు కూడా ప్రమాదం పొంచి ఉంది '' అని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు.

### త్వరలో నేర చట్టాల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం: అమిత్‌షా

నకిలీ నోట్ల కట్టడికి మరింత పటిష్ఠంగా పోరాడాలి. ఆంగ్లేయుల కాలం నాటి 3 చట్టాలను మార్చాల్సి ఉంది. సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ చట్టాల్లో మార్పులు చేయాల్సి ఉంది. ఈ మూడు చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసి పార్లమెంట్ ముందుంచింది. త్వరలోనే నేర చట్టాల బిల్లు ఆమోదం పొందుతుంది. శాసనసాలను సురక్షితంగా ఉంచడమే పాత చట్టాల ఉద్దేశంగా ఉండేది. ప్రజల హక్కులను సురక్షితంగా ఉంచడం కొత్త చట్టాల ఉద్దేశం. కొత్త చట్టాల ఆధారంగా అధికారులు ప్రజలకు రక్షణ కల్పించాలి" అని అమిత్‌షా పిలుపునిచ్చారు. ట్రైనీ ఐపీఎస్‌ల్లో 14 మందిని తెలుగు రాష్ట్రాలకు కేటాయించారు.

### అడిషనల్ డిఎంహెచ్‌ఓగా పదోన్నతి పొందిన డాక్టర్ కే. రత్నకుమార్

కాకినాడ జిల్లా డిస్ట్రిక్ట్ ఇన్యూమునైజేషన్

(వ్యాధి నిరోధక టీకాలు అధికారి) గా బాధ్యతలు అప్పగించింది. ఆయనకు పదోన్నతి వచ్చిన సందర్భం పురస్కరించుకొని కేజీహెచ్ లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటె%శ%డెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ శాలువా కప్పి జ్ఞాపిక బహుకరించి డాక్టర్ రత్నకుమార్ ను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.అశోక్ కుమార్ మాట్లాడుతూ కేజీహెచ్ లో సీఎంఓ గా డాక్టర్ కే రత్నకుమార్ అంకితభావంతో విధులు నిర్వహిస్తూ మంచి వైద్య సేవలు అందించి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హిమ ఫౌండర్ టి.వి.డి. దాస్ మాట్లాడుతూ సెలవు రోజుల్లో గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలలో అనేక వైద్య సేవలు హిమా హ్యుమానిటెరియన్ అసోసియేషన్ ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించారని తెలిపారు.

### స్థాయి సంఘం సమావేశంలో అన్ని అంశాలు ఆమోదం

లక్షలు, క్రీడ విభాగానికి సంబంధించి సుమారు రూ. 44.60 లక్షలు రెవెన్యూ విభాగానికి చెందిన లీజులు పొడిగింపులు, ఉద్యోగుల ప్రొబేషన్, సర్వీస్ స్పెషల్ ఇంక్రిమెంట్లు సంబంధించిన అంశాలతో పాటు ఇతర అంశాలను సభ్యులు ఆమోదించడమైనదన్నారు.

ఈ సమావేశంలో స్థాయి సంఘ సభ్యులతో పాటు అదనపు కమీషనరు డా.వై.శ్రీనివసరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, కార్యదర్శి పి.నల్లనయ్యు, 7వ జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎ.ఎం.ఒ.హెచ్. సి.హెచ్.సత్యనారాయణ, డాక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితాలో అభ్యంతరాల పరిశీలన ప్రారంభం

అభ్యంతరాలు లేకుండా సహకరించాలని రాజకీయ పార్టీలు, ప్రజలు సహరించాలని కోరారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్, జిల్లా రెవిన్యూ అధికారి కె. మోహన్ కుమార్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ఎన్.విజయానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్.సుధాకర్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి పాసర్ల ప్రసాద్, వై.ఎస్.ఆర్ సి.పి ప్రతినిధి జి.రవికుమార్,బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి బి.కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి కె.ఎం.రాజు, సిపిఐ(ఎం) పార్టీ ప్రతినిధి వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345
8247526179

## ఉయ్యూరులో ప్రమాదకరమైన నత్తల పెంపకం



దేశంలో నిషేధిత నత్తలను ఆంధ్రప్రదేశ్‌లోని ఉయ్యూరులో ఓ వ్యక్తి పెంచడం కలకలం సృష్టిస్తోంది. థాయ్ లాండ్ నత్తలు చాలా ప్రమాదకరమని, ఒక్కోటీ దాదాపు 50 సెంట్ల పొలంలోని పంటను నాశనం చేయగలదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి నత్తలను ఉయ్యూరులోని విశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ కుమారుడు మాదాల చంద్రశేఖర్ పెంచుతున్నారు. థాయ్‌లాండ్ నుంచి వాటిని తెప్పించి విద్యాసంస్థల అవరణలోనే ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి పెంపకం చేపట్టారు. దీనికి సంబంధించి ఓ వీడియోను యూట్యూబ్ ఛానెల్‌లో అప్ లోడ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆ వీడియో చూసిన బయాలజీ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. విశ్వశాంతి విద్యాసంస్థల ఆవరణలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రత్యేకంగా ట్యాంకుల్లో పెంచుతున్న నత్తలను, పెంపకం పద్ధతులను పరిశీలించారు. అందులోని నత్తలు నిషేధిత జాబితాలోనివి కావడంతో కేసు నమోదు చేశారు. థాయ్‌లాండ్ నుంచి వాటిని తీసుకువచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ప్రమాదకరమైన ఈ నత్తలను దేశంలోకి ఎలా తీసుకువచ్చారు? సెక్యూరిటీ తనిఖీల నుంచి ఎలా తప్పించుకున్నారనే వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నత్తలను ఎందుకు పెంచుతున్నారు? ఏ దేశానికి ఎగుమతి చేస్తారనేది కూడా విచారిస్తున్నారు. కాగా, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పోలీసు అధికారులు చెప్పారు.

## పంచాంగం

శనివారం 28-10-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
ఆశ్వయుజ మాసం

తిథి : శు. పూర్ణిమ రా. 01.57
నక్షత్రం : రేవతి ఉ. 07.57
వర్జ్యం : రా. 03.06 ల 04.37

## రామన్నపాలెం నుంచి ఎం.వి.ఆర్ ఆధ్వర్యంలో బయలుదేరిన ఉచిత తీర్థయాత్ర బస్




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ వ్యాపారవేత్త, సేవాపరుడు ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గ పరిధి అచ్యుతాపురం మండలానికి చెందిన రామన్నపాలెం గ్రామం నుంచి భక్తులతో ప్రముఖ పుణ్యక్షేత్రాలు అయిన సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ దర్శనములకు బస్ లు బయలు దేరాయి.ఈ కార్యక్రమానికి ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ (సంజూ బాబు) హాజరై గ్రామ ప్రజలతో మమేకమై, అందర్నీ పలకరిస్తూ ఒక్కొక్కరిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న శివాలయాన్ని దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించారు. దీనిలో భాగంగా, ఈ యాత్రలో పాల్గొన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం పూట అల్పాహారం మరియు మధ్యాహ్నం భోజనం సదుపాయంతో పాటు రాత్రి వేళకి కూడా అల్పాహారం ను సమకూర్చినారు. దానికి తోడు ఎక్కడికక్కడ తాగు నీటి సదుపాయాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంజు టీం సభ్యులు,ఎం వి ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శత శాతం (స్థూల నమోదు నిష్పత్తి) సాధించే దిశగా కృషి చేయాలి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 5 సం. నుండి 18 సం.ల బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ బడిలోనే చదువుతూ ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన జి.ఈ.ఆర్. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (స్థూల నమోదు నిష్పత్తి) శత శాతంగా ఉండాలన్నారు. జిల్లాలో బడి బయట ఉన్న 2141 విద్యార్థులు నవంబర్ 10 వ తేదీ నాటికి బడిలో లేదా ఓపెన్ స్కూల్ లో జాయిన్ చేయాలని ఎంఇఓ లను ఆదేశించారు. చదువుపై ఆసక్తి లేని విద్యార్థులను వృతివిద్యా శిక్షణలో చేర్పించాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్ నమోదు కానీ 11560 విద్యార్థుల వివరాలు నవంబర్ 10 వ తేదీ లోపల ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. నవంబర్ 3వ తేదీన ఆంగ్ల మాధ్యమంలో జరిగే ఎస్ ఈ ఏ ఎస్ జే పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన తరగతులు, వీలైనన్ని ఎక్కువ మాక్ టెస్ట్ నిర్వహించాలని ఎంఈఓ లను ఆదేశించారు. టి ఎ ఆర్ ఎల్, ఎల్ఐపి కార్యక్రమాల నిర్వహణ, డిజిటల్ తరగతులు, డిజిటల్ మధ్యమాల వినియోగం పై కచ్చితమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. 10 వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు రేమెడియల్ తరగతులు నిర్వహించి శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని అన్నారు. బడిలో ప్రమాదాలు జరగకుండా అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని అంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తరగతులు నిర్వహించాలని డిఇఓ ను ఆదేశించారు. అదేవిధంగా అన్ని స్థాయిలలో విద్యా ప్రమాణాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో, డీఈవో వెంకట లక్ష్మమ్మ, డివైఇవో సుజాత, ఎ.డి(స్కీమ్స్) రవిబాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి చాముండేశ్వర రావు జిల్లాలోని ఎంఈఓ లు, సి.ఆర్.పి లు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నేడు రక్తదాన శిబిరం





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశాల మేరకు స్థానికఎన్.టీ.ఆర్ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం (రెండవ రోజు) "ఓపెన్ హౌస్" నిర్వహించి, వివిధ పాఠశాలలు, కాలేజ్ లు నుండి విచ్చేసిన విద్యార్థులకు పోలీసు విధుల పట్ల, వినియోగించే ఆయుధాలు, సాంకేతికత, డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్, క్లూస్ టీం, ట్రాఫిక్, కమ్యునికేషన్ పరికరాలు పట్ల అవగాహన కల్పించి, విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు.

ఈ కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ ఇనస్పెక్టర్ సతీష్, అనకాపల్లి టౌన్ ఎస్.హెచ్.ఓ మోహనరావు, ఎస్సై సత్యనారాయణ, ఏ.ఆర్ ఎస్సై ఆదినారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా రక్తదానం శిబిరం అనకాపల్లి జిల్లా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు వారిచే ఏర్పాటు చేయడం జరిగింది.... ఉదయం 8.30 గంటలకు ఎన్టీఆర్ హాస్పిటల్ ఎదురుగా ఆఫీసులో బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించనున్నారు.

## జగనన్నకు చెబుదాం లో వచ్చే అర్జీలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలి



**అనకాపల్లి/బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):** జగనన్నకు చెబుదాం (స్పందన)కు వచ్చే అర్జీలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బుచ్చయ్యపేటలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులు, ఫిర్యాదులు స్వీకరించారు. సమాధానంలో తిరస్కరణకు గల కారణాలను వివరంగా తెలియజేయాలన్నారు. అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. ఈరోజు స్పందనకు 393 దరఖాస్తులు వచ్చాయి వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ రాజ్, జిఎస్ విఎస్ ప్రత్యేక అధికారి మంజుల వాణి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ క్రికెట్ టోర్నమెంట్ లో విజేతలుగా ఎన్.ఆర్.ఐ కాంప్లెక్స్ బ్రాంచ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎన్.ఆర్.ఐ బాయ్స్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి 25 వ తేదీలలో జరిగిన ఇంటర్మీడియట్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆదర్శ నగర్ హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ గంగా రాము సహాయ సహకారాలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఇంటర్మీడియట్ క్రికెట్ టోర్నమెంట్ లో మొత్తం 28 టీమ్స్ పాల్గొనగా. అన్ని జట్లు పోటాపోటీగా పాల్గొని అన్ని జట్లు ప్రదర్శన ఎంతో ఆసక్తికరంగా జరిగాయి చివరగా ఎన్.ఆర్.ఐ కాంప్లెక్స్ బ్రాంచ్ వారు విజేతలగా నిలవగా రెండవ స్థానంలో ఎన్.ఆర్.ఐ వెంకోజీ పాలెం బ్రాంచ్ వారు నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మరియు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవీష్ (ఎన్.ఆర్.ఐ కాంప్లెక్స్ బ్రాంచ్ ) వారు దక్కించుకున్నగా బెస్ట్ బౌలర్ గా గణేష్ (శ్రీ కశ్యప్ కాలేజ్) వారు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎన్.ఆర్.ఐ వైస్ ప్రిన్సిపల్ మురళి శంకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంత బాగా జరగడానికి కారణమైన మనోజ్ మరియు టీం మెంబెర్స్ అందరిని అభినందించారు. మొత్తం 28 జట్లు పాల్గొనగా మొదటి రెండు స్థానాలు మన ఎన్.ఆర్.ఐ కాలేజీకి రావటం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. ఈ సందర్భంగా రాము గంగా మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లోని ముందుకు రాణించాలని. యువత ఏ కార్యక్రమాలు చేసిన నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదర్శనగర్ హెల్పింగ్ హాండ్స్ గంగా రాము ఎన్.ఆర్.ఐ వైస్ ప్రిన్సిపల్ మురళి శంకర్, వి గోపికృష్ణ , రాగతి లాలాజీ మరియు ఆర్గనైజింగ్ డిపార్ట్మెంట్ మనోజ్ పాల్గొన్నారు.

## విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు



**బాపట్ల:** విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు దారి తప్పి ఐదో తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు గురి చేసిన ఘటన బాపట్లలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని మల్లికార్జున బృందావనం కాలనీ పురపాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.రామచంద్రరావు ఎక్కాలు చెబుతానంటూ బాలికను ఒంటరిగా గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత విద్యార్థిని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు జరిగిన ఘటన తెలియజేసి విలపించింది. వారు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటేశులు, పట్టణ సీఐ శ్రీనివాసులు.. బాధితురాలు, కుటుంబసభ్యులను విచారించి వివరాలు నమోదు చేశారు. ప్రధానోపాధ్యాయుడిపై పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా రామకృష్ణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** భారతీయ జనతాపార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా అనకాపల్లి వాస్తవ్యులు కర్రి రామకృష్ణ ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొంగాలి గోపీ శ్రీనివాస్ నియమించారు. రామకృష్ణ గతం లో యువ మోర్చా ప్రధాన కార్యదర్శి,బీజేపీ పట్టణ అధ్యక్షులు గా, అసెంబ్లీ కన్వీనర్ గా పనిచేశారు. వీరి తండ్రి కర్రి వెంకట రమణ జిల్లా ప్రధాన కార్యదర్శి గా పని చేశారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా లో ఉన్న ఓబీసీ సమస్యలు ను గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకుని వెళ్లి తద్వారా ఓబీసీ మోర్చా బలోపేతం కి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. నాకు ఈ బాధ్యత రావడానికి కృషి చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బివిఎస్ వర్మ, చదరం నాగేశ్వరరావు( ఎంపిటిసి,) పట్టాభి ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

విశాఖ సమాచారమ్

శనివారం 28-10-2023

# కేజీహెచ్‌లో శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

● దేశ, విదేశాల నుంచి సుమారు ● మూడు వేల మంది పూర్వ విద్యార్థులు హాజరు ● 28న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, గవర్నర్ హాజరు ● సెంటినరీ అలూమ్ని బిల్డింగ్‌ను ప్రారంభించనున్న ఉపరాష్ట్రపతి






**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర మెడికల్ కళాశాల వందేళ్ల వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు దేశ, విదేశాల్లో స్థిరపడిన సుమారు మూడు వేల మంది పూర్వ విద్యార్థులు హాజరవుతున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజు తెలిపారు. తొలిరోజు (శుక్రవారం) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ వర్చువల్‌గా పాల్గొని మాటాడారు. కళాశాలలో నిర్వహించే వేడుకల్లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని పాల్గొంటారు. పూర్వ విద్యార్థులు అందించిన నిధులతో పానుగల్ బిల్డింగ్‌లో ఆధునికీకరించిన సెంటినరీ హాలును కేంద్ర మంత్రి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అలాగే, రెండో రోజైన శనివారం ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.50 కోట్లతో ఆంధ్ర మెడికల్ కళాశాల ఆవరణలో నిర్మించిన సెంటినరీ అలూమ్ని భవనాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులైన సీనియర్ వైద్యులతో ఆయన మాట్లాడనున్నారు. 28న ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అలూమ్ని నైట్ నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. చివరిరోజు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులకు సన్మాన, సత్కార కార్యక్రమాలను కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని పాల్గొననున్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంను పరిశీలించిన గౌరవ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ శ్రీ జె.నివాస్,



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** UPHC కొబ్బరితోట లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంను గౌరవ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ శ్రీ జె.నివాస్, ఐఏఎస్ వారు పర్యవేక్షించి పేషెంట్ లతో సంబాషించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారికి మెడికల్ ఆఫీసర్స్ కి పలు సూచనలు చేశారు. తదుపరి స్థానిక గౌరవ MLA వాసుపల్లి గణేష్ ఈ వైద్య శిబిరంను సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష స్పెషలిస్ట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇవి పట్టణ ఆరోగ్య కేంద్రములలో గల 24 సచివాలయాలలో నిర్వహించారు. పట్టణ ప్రాంతంలో 10808 మందికి వైద్య సేవలు అందించడమే కాకుండా ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరిగింది. పైన చూసిన OPలో స్పెషలిస్ట్ సేవలు ఉచితంగా అందించడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు గారు తెలియచేశారు.

ఈ వైద్య శిబిరాల్లో డా.పి.జగదీశ్వర రావు గారు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డా.బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి, గౌరవ వార్డు సభ్యులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, జివిఎంసి అధికారులు, బి.నాగభూషణం, MPHEO, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన పథకం

ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన పథకం క్రింద దిగువ తెల్పబడిన స్వయం ఉపాధిపథకాలు ప్రారంభించుకునేందుకు 25 లక్షల రూపాయల వరకు సెక్యూరిటీ అక్కరలేని రుణాలు లభిస్తాయి. 18 ఏళ్ళు పై బడిన భారత పౌరులు ఈ పథకానికి అర్హులు. పరిశ్రమల శాఖ ద్వారా ఈ అవకాశాలు పొందవచ్చు.

టెంట్ హౌస్+ మండపం డెకరేషన్ ,సెంట్రింగ్ + మార్బల్స్ / గ్రానైట్ పరచడం ,డి జె సౌండ్ సిస్టం o లైటింగ్ సౌండ్ సిస్టం ,బ్యూటీ పార్లోర్, స్పాంజెంట్స్ సెలోన్,నెట్ పాయింట్ + జిరాక్స్ + స్క్రీన్ ప్రింటింగ్ + ఫ్లెక్సీ ప్రింటర్ +కేబుల్ ఆపరేటర్ + ఫోటో స్టూడియో +అరటి, బొప్పాయి, మామిడి, ఆపిల్స్, పండ్ల మగ్గబెట్టే గదులు +వేరుసెనగ కాయలు తొక్కుతీసే యంత్రం ,మొక్కజొన్న కండి ద్వారా క్యారీ బ్యాగుల కొబ్బరి పీచు కార్, బైక్స్ వాటర్, ఫోమ్, మరమత్తులు సర్వీసెస్ చెక్క గానుగ ఆయిల్స్, ఆయిల్ మిల్స్,పచ్చళ్ళుతయారీ పిండిమిల్లు,కారంపొడి,ఆక్వా ఫీడ్ ,పౌల్ట్రీ ఫీడ్ రైస్ మిల్ + డాల్ కట్టర్ +

బట్టలు డ్రై క్లీనింగ్ + వాషింగ్ టైలరింగ్ + మగ్గ+ గార్మెంట్స్ తయారీ + సారీ ప్రింటింగ్ + చేనేత మగ్గాలు + కళంకారీ చీరలు + పెయింటింగ్ + కంప్యూటర్ మెషిన్ ఎంబ్రాయిడరీ సారీ రోలింగ్ + సారీ డ్రై వాష్.సెల్ ఫోన్స్ + కంప్యూటర్స్ , వాషింగ్ మచిన్స్ + గ్యాస్ స్టోవ్స్ + మోటార్స్ + ఫాన్స్, ఏసీ+ జనరేటర్లు, ఏరేటర్స్ + బోట్స్ మరమ్మతులు కోసం ఇస్తారు.

దాబా/టిఫన్ /హెూటల్ / బేకరీ / మొబైల్ వన్ హెూటల్స్/ స్వీట్స్/ హాట్ చిప్సం జ్యూస్ పాయింట్. + ఐస్ క్రీం తయారీ + బికెట్స్ బన్స్ తయారీ o జున్ను + వెన్న + నెయ్యి+ పుట్టగొడుగుల పెంపకం+ వర్మీ కంపోస్ట్ + పేపర్ కప్స్ అండ్ ప్లేట్స్ + విస్తరాకులు+ జిమ్ంజుంబా+ఫీజియోథెరఫీ + క్లీనిక్ం బ్లడ్ & షుగర్ టెస్ట్/ డెంటల్ హాస్పిటల్స్.ఐరన్ బీరువాలు టేబుల్స్ తయారీ కుండలు తయారీ,వుడెన్ ఫర్నిచర్ తయారీ+తలుపులు చెక్క డం + డబ్ల్యూపీవీ విండోస్ తయారీ + కప్ బోర్డ్స్ తయారీ + సింకు తయారీ + పిల్లర్ బాక్స్ అండ్ ఫ్రిడ్జిస్ తయారీ + సోడా మెషిన్ తయారీ +ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌బంగారు వెండి నగలు తయారీ, వాటర్ బాటిల్స్ + ప్లాస్టిక్ బాటిల్ తయారీ + పేపర్ కప్స్ / ప్లేట్స్ + బ్యాగ్స్+ హెచ్‌డీపీఈ పైప్సం స్క్రాబ్బార్ సిమెంట్ంఫ్లై ఆష్+మట్టి+ సీఎల్‌సీ+ ఇటుకల తయారీ,చెప్పుల తయారీ ఎస్ వి యు ఎన్ పైప్స్, జల్లిల్లు,వరలు + పార్కింగ్ టైల్స్ +ప్లాస్టిక్ సీసా లని తుక్కు ముక్కలు చేసి అమ్మడం ప్లాస్టిక్ వైరు లో ఉంటె రాగి బైటకి తీయడం. బ్లీచింగ్ + ఫినాయిల్ + రసాయనాలు+సబ్బులు,వెల్డింగ్ వర్క్స్ / ఇంజనీరింగ్ :బొల్ట్స్,ఇతడి రాగి బిందెలు o గ్రిల్స్. జిప్సుమ్+ పిఓపి షీట్స్ తయారీ oబుక్ బిండింగ్ నోట్ బుక్స్ తయారీ.

# రిజర్వేషన్ లేని ప్రత్యేక రైళ్లు బెంగళూరు-కొత్త భువనేశ్వర్- ఎస్ఎంవి బెంగళూరు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బెంగుళూరు-న్యూ భువనేశ్వర్ స్టేషన్- ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రయాణీకుల అదనపు రద్దీని తగ్గించడానికి అన్‌రిజర్వ్‌డ్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు క్రింద వివరించబడ్డాయి:

1. రైలు నెం. 06287 ఎస్‌వివిఎం బెంగళూరు-న్యూ భువనేశ్వర్ స్టేషన్ జనసాధరణ ప్రత్యేక రైలు బెంగళూరులో శనివారం మధ్యాహ్నం 03.30 గంటలకు బయలుదేరుతుంది, అంటే 28.10.2023న 22.38 గంటలకు దువ్వాడ చేరుకుని 22.40 గంటలకు బయలుదేరుతుంది. పెందుర్తికి 23.23 గంటలకు చేరుకుని 23.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 06.30 గంటలకు న్యూ భువనగిరి స్టేషన్‌కు చేరుకుంటుంది.

2. తిరుగు దిశలో రైలు నెం. 06288 న్యూ భువనేశ్వర్ స్టేషన్ - బెంగళూరు ఆదివారం ఉదయం 08.15 గంటలకు అంటే 29.10.2023 న్యూ భువనేశ్వర్ స్టేషన్ నుండి బయలుదేరుతుంది, ఇది పెందుర్తికి 15.10 గంటలకు చేరుకుంటుంది మరియు 15.12 గంటలకు బయలుదేరి తదుపరి SMV బెంగళూరు చేరుకుంటుంది. రోజు 09.45గం.

**స్టాప్‌లు:** బెంగళూరు కంటోన్మెంట్ కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాటపాడి, రేణిగుంట, గూడూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం, పలాస, బ్రహ్మపూర్, ఛత్రపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్ మధ్య న్యూ భువనేశ్వర్ స్టేషన్.

**కంపోజిషన్:** 23 కోచ్‌లు (21 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు 2- లగేజ్ కమ్ బ్రేక్ వ్యాన్‌లు).

## జగనన్న ఆరోగ్య సురక్ష లో భాగంగా శుక్రవారం 503 మందికి టోకెన్లు జారీచేసారు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష, సచివాలయం 1086148 పరిధిలో ఉన్నటువంటి హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ 503 మందికి టోకిలు జారీ చేయడం జరిగినది వైద్యం అనేది ప్రతి ఇంటి ముందుకి వెళ్లాలని ఉద్దేశంతో జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులుశ్రీ జగన్మోహన్ రెడ్డి గారు ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పీతల గోవింద డైరెక్టర్ ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ 22వ వార్డ్ ఇంచార్జ్ ,పార్లమెంట్ జనరల్ సెక్రటరీ మహేష్ గారు, మహిళఅధ్యక్షురాలు వంకర శశికళ, కన్వీనర్లు చంద్రకళ , స్వాతి ,శ్యాంసుందర్ ,రమేష్, నిజాముద్దీన్ ,బేగం, నాగమణి , సచివాలయం సిబ్బంది ,వాలంటీర్లు, పాల్గొన్నారు.

# శనివారం సాయంత్రం వెంకన్న ఆలయం మూసివేత



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి ఆదివారం ఉదయం వరకు పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా మూసివేయడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు చెప్పారు.శనివారం రాత్రి ఒంటి గంట మూడు నిమిషాల నుండి తెల్లవారితే ఆదివారం రెండు గంటల 22 నిమిషముల వరకు ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి అశ్వినీ నక్షత్రం నందు ఏర్పడుచున్న రాహు గ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఆలయం మూసి వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. తిరిగి ఆదివారం ఉదయం ఐదున్నర గంటలకు ఆలయం తెరిచి శుద్ధి పుణ్యాహవాచనాలు సంప్రోక్షణాధి కార్యక్రమంలో నిర్వహించిన తర్వాత భక్తులందరకూ దర్శన సౌకర్యం ఉంటుందని ఆయన చెప్పారు.

ఈ గ్రహణం అశ్విని నక్షత్రములో మేష రాశి యందు పట్టుటచే అశ్విని భరణి కృత్తిక ఒకటో పాదం నక్షత్ర జాతకులు ముఖ్యంగా మేషరాశి వారు ఈ గ్రహణ శాంతులు చేయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.ఈ గ్రహణం వలన మేష రాశి వారితో పాటు వృషభం కన్య మకర రాశి వారు కూడా గ్రహణ శాంతులు చేయించుకోవడం ఉత్తమమని ఆయన చెప్పారు.గ్రహణ శాంతి లో భాగంగా యధాశక్తిగా బియ్యము వస్త్రములు వెండి బంగారపు వస్తువులు దానం చేయడం మంచిదని ఆయన చెప్పారు.

## నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి వైస్ ఛైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరు కావాల్సిందిగా కోరారు.

## విజయబాబును సన్మానించిన టీడీపి నాయకులు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** గత 15రోజులుగా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ ను నిరసిస్తూ పలు గ్రామాల్లో పాదయాత్ర చేస్తూ దేవాలయాలను సందర్శిస్తున్న మాజీ ఎంపిపి కొలుకులూరి విజయ బాబు శుక్రవారం నాడు అచ్యుతాపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి టీడీపీ విస్తృత సమావేశానికి రాంబిల్లి మండలం నారాయణపురం నుంచి అచ్యుతాపురం వరకు 16వ రోజు పాదయాత్ర చేస్తూ మార్గమధ్యంలో గల ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ విజయబాబును కలిసి పాదయాత్రకు సంఘీభావం తెలియజేశారు. అనంతరం సమావేశానికి చేరుకున్న కొలుకులూరి విజయ బాబును టీడీపి మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు,మాజీ జెడ్పి చైర్ పర్సన్ లాలం భవాని భాస్కర్ లు ఘనంగా సన్మానించారు. నిస్వార్థంగా ఆయన చేస్తున్న పాదయాత్రను ప్రశంసించారు. ఈ పాదయాత్రలో ఈ పాదయాత్రలో మాజీ జెడ్పిటిసి రాజాన నారాయణమ్మ, మాజీ వైస్ ఎంపీపీ గోన్నబత్తుల శేషు, ఏటికొప్పాక మాజీ ఎంపీటీసీ ఊడిరామకృష్ణ, ఐటీడీపి మండల ఇంచార్జ్ రాజాన వెంకునాయుడు, పైడియ్య,సీతారాం, చిన్నబాబు, శ్రీను, దేవుడు,యలమంచిలి టీడీపీ నాయకులు ఆడారి ఆదిమూర్తి, పండూరి శ్రీనివాసరావు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# 9వ తేదీ అనకాపల్లి బహిరంగ సభ




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర వ్యాప్తంగా 26వ తేదీ నుంచి ప్రారంభమైన తొలి విడత సామాజిక న్యాయ బస్సు యాత్ర నవంబర్ 9వ తేదీన అనకాపల్లి నియోజకవర్గంలో ముగియనుందని, ఆరోజు అనకాపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభ వచ్చే ఎన్నికలకు శంఖారావం కావాలని, ఇక్కడి నుంచే వైసిపి తొలి విజయం నమోదు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. అనకాపల్లి నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ఈ బస్సు యాత్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మంగా తీసుకున్నారని చెప్పారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి 175 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర పూర్తి కావాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మొదటి విడత బస్సు యాత్ర ముగింపు సభ అనకాపల్లిలో కావాలని పట్టుబట్టి ఏర్పాటు చేసుకున్నామని కాబట్టి, పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి ఈ సభను విజయవంతం చేయాలని మంత్రి అమర్నాథ్ కోరారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాలు ఒక ఎత్తు.. ఈ ఆరు నెలలు జలపాల్సింది మరొక ఎత్తు అని అమర్నాథ్ చెబుతూ 9వ తేదీన అనకాపల్లిలో జరిగే సభ గడిచిన సబలన్నిటికన్నా విజయవంతం కావాలని విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి నియోజకవర్గ పార్టీ శ్రేణుల నిబద్ధత, పట్టుదల తనకు తెలియనిది కాదని, పార్టీ కోసం నిరంతరం శ్రమించే వీరు ఈ సభ విజయవంతానికి శక్తివంచన లేకుండా పని చేస్తారని నమ్మకం తనకు ఉందని అమర్నాథ్ అన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం రెండున్నర గంటలకు బస్సు యాత్ర అనకాపల్లికి చేరుకుంటుందని, మూడు గంటలకు సభా ప్రాంగణానికి వస్తుందని అని చెప్పారు. ఈ సభలో ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ముఖ్య నాయకులు, కోఆర్డినేటర్లు ఈ సభలో పాల్గొంటారని అమర్నాథ్ వివరించారు. అందువలన పార్టీ శ్రేణులు శ్రమించి ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యేటట్టు చూడాలని, దీని వలన పార్టీ విజయ లక్ష్యం ఏమిటి అన్నది వారికి అర్థమవుతుందని అన్నారు. ఈ సభ విజయవంతం చేయడం ద్వారా ఎన్నికలకు ముందు పార్టీ ఎంత బలంగా ఉంది, పార్టీ శ్రేణులు ఎన్నికలకు ఏవిధంగా సమాయత్తం అవుతున్నది తెలియ చెప్పాల్సిన అవసరం ఉందని మంత్రి అమర్నాథ్ అన్నారు. అలాగే వచ్చే నెల ఒకటి, రెండు తేదీలలో గ్రామాల వారీగా పార్టీ నాయకులతో తను సమావేశం నిర్వహిస్తానని అమర్నాథ్ వెల్లడించారు.

ఇదిలా ఉండగా గృహ సారధుల ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి అమర్నాథ్ నాయకులను ఆదేశించారు.

జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని వైసిపి నినాదంగా మార్చుకుని ముందుకు వెళు తుందని అన్నారు. గత ప్రభుత్వాలేవి ఇవ్వని విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అందజేస్తుందని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి పై ఉన్న విశ్వాసాన్ని , ఎన్నికల్లో నిరూపించాలని ఆయన కోరారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ తొమ్మిదో తేదీన అనకాపల్లిలో జరిగే సభ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి గుర్తుండిపోయేలా నిర్వహించాలని కోరారు. అనకాపల్లి నియోజకవర్గ ప్రజలు మళ్ళీ అమర్నాథ్ నే గెలిపించుకోవాలన్నా సంకల్పంతో ఉన్నారని అన్నారు. అలాగే 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవాలన్న లక్ష్యంతో పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమానికి అనకాపల్లి పట్టణ వైసిపి అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు అధ్యక్షత వహించారు.

# వాడుకుని వదిలేశారు

**అమరావతి, (విశాఖ సమాచారమ్):** జగన్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నవరత్నాలు -పేదలందరికీ ఇళ్లు' పథకం అమలులో కీలకపాత్ర పోషిస్తున్న రిటైర్డ్ ఇంజనీర్లు, ఉద్యోగులందరినీ జగన్ సర్కారు విధుల నుంచి తొలగించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో అటెండరు నుంచి ఉన్నతాధికారుల వరకు వివిధ క్యాడర్లలో సేవలందిస్తున్న మొత్తం 76 మంది రిటైర్డ్ ఉద్యోగులను వెంటనే రిలీవ్ చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను కోరుతూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీషా ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండేళ్లుగా జీతభత్యాలు ఇవ్వకుండానే ప్రభుత్వం వీరి సేవలను వినియోగించుకుంది. తీరా అవసరం తీరాక ఇక మీ సేవలు చాలంటూ వారందరినీ ఇంటికి సాగనంపింది. వివరాల్లోకి వెళ్తే, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ జగన్ సర్కారు 2022 జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగులకు మాత్రం ఆ ఉత్తర్వులను వర్తింపజేయలేదు. దాంతో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్‌లో 60 సంవత్సరాలకు రిటైరైన ఉద్యోగులందరికీ వీడ్కోలు పలుకుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 నుంచి 60 సంవత్సరాలకు పొడిగించినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రభుత్వ అధీనంలోని కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులకు కూడా ఆ ఉత్తర్వులను అమలు చేసిందని, అదే విధంగా ఇప్పుడు కూడా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు తమ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పొడిగించాలని కోరుతూ హౌసింగ్ కార్పొరేషన్‌లో 60 ఏళ్లకు రిటైరైన కొంతమంది ఉద్యోగులు హై కోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం రిటైర్డ్ ఉద్యోగులకు అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల మేరకు హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు రిటైర్డ్ ఉద్యోగుల సేవలను 20 నెలలుగా వినియోగించుకుంటున్నారు. వారికి జీతభత్యాలు మాత్రం చెల్లించలేదు.

కోర్టు తుది తీర్పును అనుసరించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, కోర్టు నుంచి తుది తీర్పు వచ్చి, ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చే వరకు వేతనాలు లేకుండానే పని చేసేలా రిటైర్డ్ ఉద్యోగుల నుంచి సమ్మతి లేఖలు కూడా తీసుకున్నారు. ఈరోజు కాకపోతే రేపైనా జీతాలు వస్తాయన్న ఆశతో సమ్మతి లేఖలు ఇచ్చిన రిటైర్డ్ ఉద్యోగులు వేతనాల కోసం గట్టిగా నిలదీయలేకపోయారు. తీరా చూస్తే గత ఆగస్టు 31వ తేదీన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా తుది తీర్పును వెలువరించింది. ఇంతకు ముందు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేస్తూ కార్పొరేషన్లలో 60 ఏళ్లకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగడానికి అర్హులు కాదని, వారిని సేవలనుంచి తొలగించాలని తుది తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పు ప్రకారం హౌసింగ్ కార్పొరేషన్‌లో సేవలందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులందరినీ అప్పుడే తొలగించాల్సి ఉంది. అయితే ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కనీసం 5 లక్షల ఇళ్లనైనాపూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచుతుండటం, హౌసింగ్ కార్పొరేషన్‌లో జిల్లా హెడ్స్ మొదలుకొని డీఈలు, ఏఈలు, ఇతర ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉండటంతో రిటైర్డ్ ఇంజనీర్లు, ఉద్యోగులను రిలీవ్ చేయకుండా వారితో రేయింబవళ్లు పని చేయించుకున్నారు.

జీతాలు ఇవ్వకుండా పని చేయాలని ఒత్తిడి పెంచేస్తే ఎలాగంటూ ఉద్యోగులు గగ్గోలు పెడుతుండటంతో హౌసింగ్ బోర్డులో చర్చించి వారికి వాహనాల అలవెన్సు కింద నెలకు రూ.45 వేలు చొప్పున చెల్లించడానికి నిర్ణయం తీసుకున్నారు.ఆ విధంగా రిటైర్డ్ ఉద్యోగులతో పని చేయించుకుని ఎట్టకేలకు రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల్లో 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించిన హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు ఇటీవలే కాకినాడ జిల్లా సామర్ల కోట లే-అవుట్‌లో ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా సామూహిక గృహప్రవేశాలు కూడా చేయించారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి కూడా టార్గెట్ల ఒత్తిడి తగ్గి పరిస్థితులు కాస్త చక్కబడటంతో ఇక తమ సేవలు అవసరం లేదంటూ ఇంటికి సాగనంపేస్తున్నారని రిటైర్డ్ ఉద్యోగులు వాపోతున్నారు. గత 20 నెలలుగా జీతాల్లేకుండా పని చేసిన తమకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు.

## కార్పొరేటర్‌కు చెందిన బార్ మూసివేత




**కూర్మన్నపాలెం, (విశాఖ సమాచారమ్):** నకిలీ పత్రాలతో రెన్యువల్ చేసుకుంటూ కూర్మన్నపాలెం మెయిన్ రోడ్డులో అక్రమంగా నడుపుతున్న శ్రీదుర్గ రెస్టారెంట్ అండ్ బార్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మూసివేశారు. బార్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. గ్రీన్‌సిటీకి చెందిన బండి సురేశ్‌కుమార్‌కు చెందిన భవనంలో గత కొన్నేళ్లుగా బార్‌ను కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు నిర్వహిస్తున్నారు. అయితే కొన్నాళ్లుగా భవనానికి అద్దె చెల్లించకపోవడంతో పాటు నకిలీ పత్రాలతో బార్‌కు రెన్యువల్ చేయించుకుంటున్నారు. భవన యజమాని ప్రమేయం లేకుండా ఫోర్జరీ సంతకాలతో బార్‌ను కొనసాగిస్తున్నారు. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు భవన యజమాని సురేశ్ కుమార్ తన ప్రమేయం లేకుండా ఫోర్జరీ సంతకాలతో కూడిన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తున్నట్టు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన ఎక్సైజ్ అధికారులకు బార్ లైసెన్స్ రెన్యువల్‌కు జత చేసిన పత్రాలు నకిలీవని గుర్తించి బార్ లైసెన్సును రద్దు చేశారు.

## డబుల్ - పలు రైళ్లు దారి మళ్లింపు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్‌లో పలు రైళ్ల రద్దయ్యాయి. డివిజన్ పరిధిలోని భద్రతా పనుల కారణంగా ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దైన వాటిలో ప్యాసింజర్ సహా, ఉదయ్ డబుల్ డెక్కర్ రైలు ఉన్నాయి. అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో రాజమండ్రి - విశాఖ మధ్య నడిచే ప్యాసింజర్ రైలును (07466) పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా తేదీల్లో తిరుగు ప్రయాణం అయ్యే రైలు (07467) కూడా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నం - విజయవాడ మధ్య ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో నడిచే డబుల్ డెక్కర్ (22701) రైలును 27, 28 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుగు ప్రయాణమయ్యే రైలు కూడా అయా తేదీల్లో అందుబాటులో ఉండదని పేర్కొన్నాయి. వీటితో పాటు 26, 27, 28 తేదీల్లో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం- కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కొరాపుట్ నుంచి తిరిగి ప్రయాణం అవుతుంది. అలాగే హౌరా - జగ్దల్‌పూర్ సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాగఢ్ నుంచి హౌరాకు తిరిగి ప్రయాణం అవుతుంది. భువనేశ్వర్- జగ్దల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (18447) కొరాపుట్ నుంచి తిరిగి ప్రయాణం అయ్యి భువనేశ్వర్ చేరుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

# ఓ నేత.. మారదా దారి తలరాత

**సాలూరు, (విశాఖ సమాచారమ్):** సాలూరు నుంచి మక్కువ మండల కేంద్రానికి 19 కి.మీ. సాలూరు-మక్కువ రోడ్డు అభివృద్ధికి రూ.56 కోట్లు మంజూర య్యాయి. కానీ, చేసిన పనులకు బిల్లులు చెల్లించక గుత్తేదారులు పనులు ఆపేశారు. గోతుల్లో ప్రయాణించలేక మామిడిపల్లి, శంబర మీదుగా 26 కి.మీ వెళ్తున్నారు. దండిగాం రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. రోడ్డు పరిశీలించి, మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదిస్తామని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

గతంలో అంబటి సత్రం కూడలిలో కోలగట్ల నివాసం ఉండేవారు. అంబటి సత్రం నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంకు వరకు రహదారి విస్తరణ అసంపూర్తిగా నిలిచిపోయింది. ఇప్పటి వరకు ఈ మార్గంలో ప్యాచ్ వర్కు పనుల కోసం రూ.25 లక్షల వ్యయం చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిపోయిన పనుల పూర్తికి రూ.3.14 కోట్లతో అంచనా వేశామని, ప్రభుత్వం వద్ద దస్త్రం ఉందని డీఈఈ టి.శ్రీనివాసరావు తెలిపారు.

**ఎస్ కోట :** బొడ్డవర రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించే వారికి ఇక్కడి పెద్ద గుంతలతో ఉన్న రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డును 516ఈ జాతీయ రహదారిగా మార్చి అభివృద్ధి చేస్తున్నారు. బొడ్డవర కూడలి నుంచి ఎమ్మెల్సీ ఇంటి వరకు ఉన్న 100 మీటర్ల రోడ్డును వదిలేసి బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నారు.

మోపాడ నుంచి నియోజకవర్గంలోని మండలాలకు ప్రధానంగా భోగాపురం మండలం ముక్కాం నుంచి బమ్మిడిపేట మీదుగా రెడ్డికంచేరు ప్రధాన రహదారి పొడవునా పెద్దపెద్ద గుంతలతో ప్రమాదాలకు పిలుపునిస్తోంది ఈ రోడ్డు. సుమారు మూడు కిలోమీటర్లు ఉండే ఈ దారిలో 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పీఆర్ డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏఎంసీ నిధులు మంజూరయ్యాయని, త్వరలో మరమ్మతులు చేస్తామని చెప్పారు.


గరికిపాడు-తాలాడ గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న సంతకవిటి - రాజాం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి

ఎమ్మెల్యేతో పాటు ప్రముఖులు తిరిగే రాజాం- సంతకవిటి రహదారి ప్రమాదాలకు నిలయంగా తయారైంది. దీని అభివృద్ధికి 2012లో అప్పటి మంత్రి కోండ్రు మురళీమోహన్ రూ.14 కోట్లు మంజూరు చేయించారు. పనులు ప్రారంభిస్తారనగా గుత్తేదారు కోర్టును ఆశ్రయించడంతో నిలిచిపోయాయి. తిరిగి తెదేపా హయాంలో 2019లో ఆయనే నిధులు మంజూరు చేయించారు. 14 కి.మీ. రహదారిని రెండు వరుసలుగా విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిపోయింది. ఈ ప్రభుత్వ హయాంలో రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఆమోదం లభించలేదు. ఆర్‌అండ్‌బీ జేఈ నాగభూషణరావు మాట్లాడుతూ నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఎమ్మెల్యే ఇంటికి కూతవేటు దూరంలో వెంకంపేట గోళీల వద్ద రోడ్డు పూర్తిగా పాడైంది. కల్వర్టు వద్ద వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పార్వతీపురం మండలంలోని చాలా గ్రామాలకు ఇదే ప్రధాన ఆధారం. వెంకంపేట వరకు రోడ్డు చిత్తడిగా మారింది. పూర్తిస్థాయి మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామని, నిధులు రాగానే పనులు చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పారు.

బొబ్బిలిలో కీలకమైన పూల్‌బాగ్ రహదారిలో పట్టణ వాసులు, ఐదారు మండలాల వారు ప్రయాణిస్తారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గొల్లపల్లి బైపాస్‌లో దాడితల్లి ఆలయం వరకు పాడైంది. చినుకుపడితే మోకాలి లోతున నీరు నిల్వ ఉంటోంది. ఎమ్మెల్యే, పురపాలక అధ్యక్షుడు వెంకట మురళీకృష్ణ, ఇతర ప్రజాప్రతినిధులు రోజూ ఈ దారిలోనే వెళ్తారు. రహదారిపై తారుపూతకు రూ.40 లక్షలు కేటాయించామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పుర కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

తోటపల్లి నుంచి కురుపాం, గుమ్మలక్ష్మీపురం మీదుగా ఒడిశాకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. ఈ మార్గంలోనే పుష్పశ్రీవాణి వెళ్తారు. తోటపల్లి నుంచి రూ.32 కోట్లతో 14 కి.మీ మేర చేపట్టిన రహదారి విస్తరణ కొన్నాళ్లుగా నిలిచిపోయింది. పెదమేరంగి కూడలి, సీమనాయుడువలస కూడలి, కురుపాంలో అసంపూర్తిగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే దమ్ముమడిని తలపిస్తుంది. వాహనాలు సైతం గోతుల్లో కూరుకుపోతున్నాయి.

కొత్తవలస మండలం అర్థానపాలేనికి సమీపంలో ఎమ్మెల్యే నివాసానికి ఆనుకుని ఉన్న కొత్తవలస-విజయనగరం రాష్ట్ర రహదారి అధ్వానంగా ఉంది. కొత్తవలస కూడలి నుంచి 200 మీటర్ల పొడవున బాగా దెబ్బతింది. నిత్యం ఎమ్మెల్యేతో పాటు అధికారులు, ముఖ్య నాయకులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా పరిస్థితిలో మార్పు లేదు. ప్రత్యేక మరమ్మతులకు రూ.2.20 కోట్లు మంజూరయ్యాయని, ఒప్పందానికి గుత్తేదారు ముందుకు రావాలని ర.భ.శా డీఈఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

## తెలుగు వ్యక్తి సహా 8 మంది
## మాజీ నేవీ అధికారులైన వీరు చేసిన నేరమేంటి?

**న్యూఢిల్లీ, (విశాఖ సమాచారమ్):** భారత నౌకాదళానికి చెందిన 8 మంది మాజీ అధికారులకు గూఢచర్యం ఆరోపణలపై ఖతర్‌లో ఓ స్థానిక కోర్టు మరణశిక్ష విధించింది. వీరిలో ఒకరు విశాఖపట్నానికి చెందిన కమాండర్ పాకాల సుగుణాకర్ కాగా మిగిలిన వారు కెప్టెన్ నవ్‌తేజ్ సింగ్ గిల్, కెప్టెన్ సౌరభ్ వశిష్ట్, కమాండర్ పూర్ణేందు తివారీ, కెప్టెన్ బీరేంద్ర కుమార్ వర్మ, కమాండర్ సంజీవ్ గుప్తా, కమాండర్ అమిత్ నాగ్‌పాల్, రాగేశ్. ఖతర్‌కు చెందిన అల్ దహ్రా కంపెనీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న వీరిని గత ఏడాది ఆగస్టులో రాజధాని దోహాలో అరెస్టు చేశారు. అయితే, వారిపై ఉన్న అభియోగాలను ఇప్పటివరకూ బహిరంగపరచలేదు. పలుమార్లు విచారణ అనంతరం స్థానిక కోర్టు మరణశిక్ష విధిస్తూ తాజాగా తీర్పు ఇచ్చింది. దీనిపై భారత విదేశాంగ శాఖ దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఈ కేసుకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని, తమ ముందు న్యాయపరంగా ఉన్న అన్ని మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొంది. 'అల్ దహ్రా కంపెనీకి చెందిన ఎనిమిది మంది భారతీయ ఉద్యోగులకు మరణశిక్ష విధించారని తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాం. పూర్తి తీర్పు కోసం వేచి చూస్తున్నాం. వారి కుటుంబ సభ్యులతో, న్యాయబృందంతో సంప్రదింపుల్లో ఉన్నాం. ఖతర్ అధికారులతోనూ దీనిపై మాట్లాడతాం' అని విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 8 మంది మాజీ అధికారులు నౌకాదళంలో 20 ఏళ్లపాటు మచ్చలేని సేవలందించి, ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించారని, అనంతరం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**కేసు పూర్వాపరాలు**

ఖతర్‌లో మరణశిక్షకు గురైన 8మందిలో అత్యధికులు 60 ఏళ్లకు పైబడినవారే. కొందరు భారత నౌకాదళానికి చెందిన ముఖ్యమైన యుద్ధనౌకలకు సారథ్యం వహించారు కూడా. వీరందరూ ఖతర్‌లోని అల్ దహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ అండ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ అనే ప్రైవేటు కంపెనీలో కొంతకాలంగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ కంపెనీ ఖతర్ నౌకాదళానికి శిక్షణ, సహకారం అందిస్తోంది. ఒమన్ వాయుసేన మాజీ స్క్వాడ్రన్ లీడర్ ఖామిస్ అల్ అజ్మీ ఈ కంపెనీకి సీఈవో. ఇటలీ టెక్నాలజీ ఆధారిత జలాంతర్గాములను నిర్మించే ఒక రహస్య ప్రాజెక్టు కోసం ఈ కంపెనీ 8మంది భారతీయ నౌకాదళ మాజీ అధికారులను ఉద్యోగులుగా నియమించుకుంది. అయితే, ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్నారన్న ఆరోపణలతో భారతీయ అధికారులు 8 మందిని గత ఏడాది ఆగస్టు 30న ఖతర్ నిఘా విభాగం అరెస్టు చేసింది. ఈ మేరకు వారి వద్ద కొన్ని ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు ఖామిస్ అజ్మిని కూడా అరెస్టు చేసినప్పటికీ గత ఏడాది నవంబరులోనే ఆయనను విడుదల చేశారు. భారతీయుల పైన మాత్రం ఈ ఏడాది మార్చి 29 నుంచి న్యాయస్థానంలో విచారణ ప్రారంభమైంది. బెయిల్ కోసం వారు ఎనిమిదిసార్లు పిటిషన్ దాఖలు చేసినప్పటికీ కోర్టు తిరస్కరించింది. గురువారం 'ఖతర్ కోర్ట్ ఆఫ్ ఫస్ట్ ఇన్‌స్టెన్స్' (ప్రాథమిక న్యాయస్థానం) వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.




**కంపెనీ మూతబడింది**

అల్ దహ్రా కంపెనీ దోహాలో తన కార్యకలాపాలను గత ఏడాది మే నెలాఖరుతో నిలిపివేసింది. కంపెనీ తాలూకు పాత వెబ్‌సైట్‌లో తాము ఖతర్ నౌకాదళానికి శిక్షణ, నిర్వహణ, రవాణాపరంగా సహకారం అందిస్తున్నామని ప్రకటించారు. కానీ, ప్రస్తుతం ఆ వెబ్‌సైట్ ఉనికిలో లేదు. కొత్త వెబ్‌సైట్‌లో ఈ విషయం ప్రస్తావనే లేదు. అరెస్టయిన భారతీయ అధికారుల వివరాలు కూడా లేవు. కంపెనీ తన పేరును కూడా దహ్రా గ్లోబల్‌గా మార్చుకోవటం గమనార్హం. విశేషమేమిటంటే, ఈ కంపెనీకి గతంలో ఎండీగా పని చేసి, ప్రస్తుతం జైలులో ఉన్న కమాండర్ పూర్ణేందు తివారీకి 2019లో ప్రవాసీ భారతీయ సమ్మాన్ పురస్కారం లభించింది. భారత్, ఖతర్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృషి చేసినందుకు కేంద్రప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించింది.

**ఎందుకు అరెస్టు చేశారు?**

గత ఏడాది ఆగస్టులో అరెస్టు చేసే నాటికి దహ్రా కంపెనీలో భారతీయులు కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. ఖతర్ నిఘావిభాగం వారిని అరెస్టు చేసింది. ఈ విషయం భారత రాయబార కార్యాలయానికి ఒక నెల రోజుల తర్వాత (సెప్టెంబరు మధ్య నాటికి) గానీ తెలియరాలేదు. సెప్టెంబరు 30న తమ కుటుంబ సభ్యులతో కొద్దిసేపు టెలిఫోన్‌లో మాట్లాడుకోవటానికి వారికి అవకాశం ఇచ్చారు. అక్టోబరు 3న దౌత్యసాయానికి అనుమతించటంతో భారత రాయబార కార్యాలయ అధికారి ఒకరు వారిని కలిశారు. ఆ తర్వాత నుంచీ వారానికొకసారి కుటుంబసభ్యులు ఫోన్‌లో మాట్లాడటానికి, దోహాలో ఉంటే వారు జైలుకు వచ్చి కలుసుకోవటానికి అనుమతించారు. భారతీయుల మీద ఉన్న ఆరోపణలు ఏమిటన్నది ఇప్పటి వరకూ ఖతర్ అధికారులు బహిరంగపరచలేదు. అయితే, భద్రతకు సంబంధించిన అంశాలపైనే ఈ అరెస్టులు జరిగి ఉంటాయన్న ఊహాగానాలు మాత్రం వెలువడ్డాయి.

**ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలు**

దశాబ్దాలుగా భారత్-ఖతర్ మధ్య స్నేహ సంబంధాలు ఉన్నాయి. 2008లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఖతర్‌లో పర్యటించారు. భారత ప్రధానమంత్రి ఆ దేశ పర్యటనకు వెళ్లటం అదే తొలిసారి. ఆ తర్వాత నుంచి ఇరుదేశాలు మరింత సన్నిహితమయ్యాయి. ఖతర్ అధినేత (ఎమిర్) షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ 2015లో భారత్‌లో పర్యటించారు. మరుసటి ఏడాది ప్రధాని మోదీ ఆ దేశ పర్యటనకు వెళ్లారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం అభివృద్ధి చెందింది. 2021లో ఖతర్ ఎగుమతులకు సంబంధించి భారత్ నాలుగో స్థానంలో ఉండగా, దిగుమతుల విషయంలో మన దేశం మూడో స్థానంలో ఉంది. ద్వైపాక్షిక వాణిజ్యం 1500 కోట్ల డాలర్లుగా నమోదైంది. దీంట్లో అత్యంత ముఖ్యమైనది ఖతర్ నుంచి భారత్‌కు సహజ వాయువు దిగుమతులే. ఇదొక్కటే 1300 కోట్ల డాలర్లు ఉంటుంది. భారత్-ఖతర్ సంబంధాల్లో రక్షణ భాగస్వామ్యం పునాది వంటిది. 2008లో మొదలైన ఈ భాగస్వామ్యం ఎప్పటికప్పుడూ విస్తరిస్తూ ఉంది.

**నుపుర్ వ్యాఖ్యలతో సంబంధాల్లో క్షీణత!**

ఇరు దేశాల మధ్య సంబంధాలకు తొలిసారిగా గత ఏడాది జూన్‌లో సవాల్ ఎదురైంది. మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ అధికార ప్రతినిధి నుపుర్ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం కలకలం రేపింది. ఈ వివాదంపై తొట్టతొలిగా స్పందించిన దేశం ఖతర్. నుపుర్ వ్యాఖ్యలపై భారత్ అధికారికంగా క్షమాపణ చెప్పాలని ఖతర్ ప్రభుత్వం డిమాండ్ చేసింది. తమ దేశంలోని భారత రాయబారిని పిలిపించి ఈ మేరకు నిరసన కూడా తెలిపింది. ఈ వివాదం యావత్ ఇస్లాం ప్రపంచానికి వ్యాపించింది. పలు ఇస్లాం దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో పార్టీ పదవి నుంచి నుపుర్ శర్మను బీజేపీ తప్పించింది. ఫలితంగా వివాదం సద్దుమణిగినప్పటికీ భారత్-ఖతర్ సంబంధాలపై ఈ ఘటన ప్రభావం చూపింది. ప్రస్తుతం 8 మంది భారత నౌకాదళ మాజీ అధికారులను అరెస్టు చేసి వారికి ఏకంగా మరణశిక్ష విధించటంతో ఇరుదేశాల స్నేహంపై కారునీడలు కమ్ముకున్నాయి. ఒకరకంగా ఇది భారత్‌కు పెద్ద సవాలే. ఖతర్‌లో 8 లక్షల మంది భారతీయులు వివిధ ఉద్యోగాల్లో ఉన్నారు. వారి వల్ల భారత్‌కు వందల కోట్లల్లో విదేశీ మారక ద్రవ్యం లభిస్తోంది. ఇరుదేశాల సంబంధాల ప్రభావం వీరి భవిష్యత్తుపై కూడా తీవ్రంగా పడనుంది.

**భారత్ తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ**

ఎనిమిది మంది భారతీయ నౌకాదళ మాజీ అధికారులకు మరణశిక్షపై ఖతర్ ప్రభుత్వంగానీ మీడియాగానీ ఎటువంటి వివరాలను వెల్లడించలేదు. సాధారణంగా ఈ రకమైన సున్నితమైన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని గల్ఫ్ దేశాలు వెల్లడించవు. గతంలో ఈ కేసు గురించి ఢిల్లీలోని భారతీయ అధికారులను ఉటంకిస్తూ వార్త రాసిన ఖతర్‌లోని ఒక భారతీయ విలేకరిని కుటుంబంతో సహా దేశం నుండి బహిష్కరించింది అక్కడి ప్రభుత్వం. 24 గంటలలోపు దేశం వదిలి వెళ్లాలని గడువు ఇచ్చారు. ప్రస్తుత కేసులో కూడా ఎనిమిది మంది భారతీయులను గతేడాది ఆగస్టులో అరెస్టు చేసిన విషయం కొన్ని వారాల తర్వాత బయటపడింది. అరెస్టయిన వారిలో ఒకరి కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం వెల్లడైంది. భారత ఎంబసీ తీవ్రమైన ప్రయత్నాలు చేసిన తర్వాత భారతీయ అధికారులు కలవటానికి సంవత్సరంలో రెండుసార్లు మాత్రమే ఖతర్ ప్రభుత్వం అనుమతించింది. ఈ కేసుపై న్యాయస్థానం ఇప్పటివరకూ ఏడుసార్లు విచారణ జరిపింది. 8 మందిని రక్షించటానికి గల్ఫ్ వ్యవహారాలపై మంచి అవగాహన ఉన్న అధికారి విపుల్‌ను ఖతర్‌లో భారతీయ రాయబారిగా కేంద్రం నియమించి పలు ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. కానీ, ఇంతలోనే పిడుగుపాటులా మరణశిక్ష తీర్పు వెలువడింది.

**విశాఖ నుంచి ఖతర్‌కు**

**విశాఖపట్నం:** గూఢచర్యం కేసులో ఖతర్ కోర్టు మరణశిక్ష విధించిన ఎనిమిది మంది భారతీయ నేవీ మాజీ అధికారుల్లో ఒకరైన పాకాల సుగుణాకర్ విశాఖపట్నానికి చెందినవారు. విశాఖపట్నం టింపనీ స్కూల్‌లో, ఆ తర్వాత విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆయన చదువుకున్నారు. అనంతరం నేవల్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యనభ్యసించి నేవీలో చేరారు. కమాండర్ స్థాయికి ఎదిగారు. విధుల్లో భాగంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళంలో కొంతకాలం పనిచేశారు. ఆ తరువాత పదవీ విరమణ చేసి దహ్రా కంపెనీలో చేరారు. అక్కడ నేవీ సంబంధిత శిక్షణ ఇచ్చేవారు. సుగుణాకర్ భార్య పేరు వైజయంతి. ఆమె విశాఖపట్నంలో టీచర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల వైజయంతి దోహాకు వెళ్లి జైలులో ఉన్న తన భర్తను కలిసినట్లు సమాచారం.

# రైల్వే ఆధునీకరణ కమీషన్ల కోసమేనా



ఆధునీకరణ పేరుతో దాదాపు అన్ని రైల్వే స్టేషన్లు పడగొట్టి ప్రయాణీకులకు నిలబడటానికి నీడ, కూర్చోటానికి కుర్చీలు లేకుండా చేస్తున్నారు రైల్వే వారు. పాసింజర్ రైళ్ళు లేక చిన్నచిన్న స్టేషన్లు గబ్బిలాల నిలయాలుగా మారాయి. ఇంక ఈ ఆధునీకరణ ఎవరికోసం? ఆ పేరుతో కమీషన్ల కోసంగాక! గతంలో ఉన్న పాసెంజర్ రైళ్లను తొలగించి పేరు మార్చి ఎక్స్‌ప్రెస్‌లుగా చేశారు. గతంలో వీటిలో అన్ని బోగీలు జనరల్ బోగీలుగా ఉండేవి. ఇపుడు వాటికి జనరల్ బోగీ ఒకటి వేసి, మీ చావు మీరు చావండి అన్నట్లుగా చేసారు. వందే భారత్ రైళ్ళు, ఇంకేదో పేరుతో మొన్న ప్రారంభం చేశారు మోడీ. అన్నీ కూడా ఏసీ రైళ్లే. తరువాత వృద్ధులకు రాయితీ తీసివేసారు. సామన్యుడు వీటి ముఖం కూడా చూడడు. మరి ఎవరికోసం ఈ ఆధునీకరణ! కమీషన్ల కోసం గాకపోతే!! సామాన్యుడి కోసం రైళ్ళే లేనపుడు ప్రజాధనం ఎవరికోసం ఖర్చు పెడుతున్నట్లు? ఈ నాటకాలు ప్రజల గ్రహిస్తున్నారు. త్వరలో ఈ అరాచక, మతవాద పార్టీలకు ఓటర్లు బుద్ధి చెప్పాలి. కేంద్ర ప్రభుత్వం ఈ మధ్య ప్రభుత్వ ఆస్తులన్నింటిని అదానీకి, అంబానీకి అమ్మేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్వో కార్యాలయాలను, కలెక్టరు కార్యాలయాలను, ఖాళీ స్థలాలను అమ్మేస్తున్నది. ఇంకెందుకీ ఆధునీకరణ? ఆధునీకరించి ఎక్కువ బేరానికి అమ్ముకోటానికా! ప్రజలు ఈ మోసాన్ని తిప్పికొట్టాలి.

## ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో మరోసారి నిఘా వైఫల్యం బయటపడింది



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో మరోసారి నిఘా వైఫల్యం బయటపడింది. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దర్శనానికి వచ్చిన ఓ భక్తుడు అమ్మవారి గర్భగుడి వీడియో తీసి యూట్యూబ్లో పోస్ట్ చేశాడు. అయితే అమ్మవారి గర్భగుడి వీడియో తీయడం నిషేధం. అయినప్పటికీ సదరు భక్తుడు అమ్మవారి గర్భగుడిని వీడియో తీయడాన్ని భద్రతా సిబ్బంది ఎవరూ గుర్తించలేదు. దీనిబట్టి ఇంద్రకీలాద్రిపై భద్రతా ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## ఇజ్రాయెల్ ప్రతీకార దాడులతో హమాస్ ఉక్కిరిబిక్కిరి.. ముగ్గురు కీలక కమాండర్ల హతం

ప్రతీకార దాడులతో హమాస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఇజ్రాయెల్ మరో విజయం సాధించింది. ఇజ్రాయెల్ ఫైటర్ జెట్ల దాడిలో దరాజ్ తుఫా బెటాలియన్‌కు చెందిన ముగ్గురు హమాస్ సీనియర్ ఉగ్రవాదులు హతమయ్యారు. ఇజ్రాయెల్ మిలటరీ ఈ విషయాన్ని వెల్లడించింది. హతమైన వారిని బెటాలియన్ డిప్యూటీ కమాండర్ ఇబ్రహీం జద్బా, కమాండర్ రిఫత్ అబ్బాస్, కంబాట్ సపోర్ట్ కమాండర్ తారెక్ మారౌఫ్ ఉన్నట్టు పేర్కొంటూ వారి ఫొటోలను విడుదల చేసింది. ఈ నెల 7న ఇజ్రాయెల్ భూభాగంలోకి దూసుకొచ్చి దాడులకు తెగబడడంలో ఈ బెటాలియన్ కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది. హమాస్ టెర్రరిస్ట్ ఆర్గనైజేషన్‌లో ఈ బ్రిగేడ్‌ను అత్యంత ముఖ్యమైనదిగా పరిగణిస్తారు. ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీ షిన్‌బెట్ మార్గదర్శకత్వంలో హమాస్ ఉగ్రవాదులను అంతం చేసినట్టు తెలిపింది. కాగా, నిన్న ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హమాస్ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ డిప్యూటీ హెడ్ షాదీ బరుద్ హతమైనట్ట పేర్కొంది. ఇజ్రాయెల్‌పై దాడికి పథక రచనలో అతడి పాత్ర కూడా ఉన్నట్టు వివరించింది.



## భారత్ నుంచి వస్తే రూ.83వేలు పన్ను విధిస్తున్న సెంట్రల్ అమెరికా దేశం

సెంట్రల్ అమెరికా దేశమైన ఎల్ సాల్వేడార్ భారత్, దక్షిణాఫ్రికా నుంచి తమ దేశానికి వస్తున్న ప్రతి ఒక్క పర్యాటకుడిపై 1,000 డాలర్ల పన్ను విధిస్తోంది. అంటే సుమారు రూ.83వేలు. ఎందుకంటే చాలా మంది ఎల్ సాల్వేడార్ కు చేరుకుని, అక్కడి నుంచి అక్రమ మార్గాల్లో యూఎస్ కు వలసపోతున్నారు. దీనికి చెక్ పెట్టేందుకే ఎల్ సాల్వేడార్ ప్రత్యేక పన్నును తీసుకొచ్చింది.

భారత పాస్ పోర్ట్ లేదా 57 ఆఫ్రికా దేశాల్లో ఏ దేశం నుంచి వచ్చినా, 1,000 డాలర్ల పన్ను చెల్లించాల్సి ఉంటుందని అక్కడి పోర్ట్ అధికారులు స్పష్టం చేశారు. ఇలా వసూలయ్యే నిధులతో ఎయిర్ పోర్ట్ నిర్మించనున్నారు. అక్రమ వలసలను నిరోధించే విషయమై అమెరికా సహాయ మంత్రి బ్రియాన్ నికోలస్ తో ఎల్ సాల్వేడార్ అధ్యక్షుడు నయీబ్ బుకెలే భేటీ అయ్యి చర్చలు సైతం నిర్వహించారు.

2023 సెప్టెంబర్ తో ముగిసిన ఆర్థిక సంవత్సరం చివరికి అమెరికా వ్యాప్తంగా 32 లక్షల మంది అక్రమ వలసవాదులు ఉన్నట్టు యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ పెట్రోల్ విభాగం గుర్తించింది. పోర్టులు, ఎయిర్ పోర్టులు సైతం అక్రమ వలసవాదుల సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుందని ప్రకటించింది. తాజాగా విధించిన పన్ను వ్యాట్ తో కలిపితే మొత్తం 1,130 డాలర్లు (రూ.93,790).

# తాండవ షుగర్ ఫ్యాక్టరీ రైతు కన్నీటి కష్టాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లాల సరిహద్దులో ఉన్న తాండవ సుగర్ చక్కెర పరిశ్రమ క్రషింగ్ నిలిచిపోవడంతో ఇటు రైతులు ఆందోళనకు గురవుతుండగా భారీగా పేరుకుపోయిన బకాయిలు మూడేళ్లుగా విడుదల చేయకపోవడంతో అటు కార్మికులు తీవ్ర కలత చెందుతున్నారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు, అలవెన్స్‌లు, పిఎఫ్, ఇతర సొమ్ములు మొత్తంగా రూ.10 కోట్లుపైనే ఇవ్వాల్సి ఉంది.

1956 నుంచి కో ఆపరేటివ్ తాండవ సుగర్ పరిశ్రమ క్రషింగ్ కొనసాగిస్తుంది. 2.60 లక్షల టన్నుల కెపాటిసి గల ఈ పరిశ్రమ గరిష్టంగా 1.50 లక్షల టన్నుల వరకూ చెరకును క్రషింగ్ చేసిన సంస్థ క్రమంగా క్రషింగ్‌ను తగ్గిస్తూ వచ్చింది. 2021లో చివరి సారిగా కేవలం 60వేల టన్నులు మాత్రమే క్రషింగ్ చేశారు. ప్రస్తుతం పరిశ్రమ మూతబడింది. సాంకేతికంగా అనకాపల్లి జిల్లా పరిధిలో పరిశ్రమ ఉంది. ఆ జిల్లాలో కోటఉరట్ల, నర్సీపట్నం, నాతవరం, పాయకరావుపేట, కాకినాడ జిల్లాలో తుని, రౌతులపూడి, కోటనందూరు, ప్రత్తిపాడు, తొండంగి మండలాలకు చెందిన దాదాపు 12 వేల మంది రైతులు చెరకును పండించి పరిశ్రమకు తోలే వారు.

**బకాయిలు అందక...**

2021 మార్చిలో క్రషింగ్ నిలిపివేసిన సంస్థ ఏడాది పాటు రైతులకు సుమారు రూ.10 కోట్లు వరకూ చెరకు బకాయిలు విడుదల చేయలేదు. పరిశ్రమ యాజమాన్యం ఎప్పుడు ఇస్తామనేది కూడా స్పష్టత ఇవ్వలేదు. ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో సిపిఎం, ఎపి రైతు సంఘాల నాయకులు రంగంలోకి దిగి దశలవారీగా పోరాటాలు సాగించారు. యాజమాన్యం దిగొచ్చే వరకూ ఉద్యమం చేశారు. ఎట్టకేలకు స్పందించి రైతుల బకాయిలను విడుదల చేశారు.

పరిశ్రమలో పని చేస్తున్న దాదాపు 500 మంది రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను మాత్రం నేటికీ ఇవ్వలేదు. ఒక్కొక్కరికీ నెలకు రూ.20 నుంచి రూ.25 వేలు వరకూ ఏడాది నుంచి 2 సంవత్సరాలు వరకూ బకాయిలు ఉన్నాయి. ఇలా సుమారు రూ.10 కోట్లుపైనే వేతన బకాయిలు రావాల్సి ఉందని కార్మికులు తెలిపారు.

**పూట గడవని కార్మికులు**

తాండవ సుగర్ పరిశ్రమ మూతపడటంతో కార్మికుల పాధికి పూర్తిగా గండి పడింది. ఏళ్ల తరబడి ఇదే పరిశ్రమలో పని చేసిన అనేక మంది కార్మికులు ఇప్పుడు ఎటువంటి పని దొరక్క కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి పోషించుకునే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలతో పోల్చుకుంటే పూట గడవడం కష్టంగా మారిందని బాధ పడుతున్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమ భారీగా బకాయిలు పెట్టడంతో అప్పులు పుట్టక పరిస్థితి మరీ దయనీయంగా మారిందని చెబుతున్నారు. ప్రభుత్వం, పాలకులు స్పందించి పెండింగ్ బకాయిలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, అలాగే తిరిగి పరిశ్రమ కార్యకలాపాలను ప్రారంభించి ఆదుకోవాలని కార్మికులంతా కోరుతున్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు




తెలంగాణలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతోంది. నవంబర్ 30న పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. తమ పార్టీ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల దగ్గరకు వెళ్లి విజ్ఞప్తి చేస్తున్నాయి. అయితే ఈ ఎన్నికలతో తొలిసారి బరిలోకి దిగుతున్న వైఎస్ షర్మిలారెడ్డి పార్టీ వైఎస్ఆర్‌టీపీకి తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తు కేటాయించింది. ఈ మేరకు బైనాక్యులర్ గుర్తును ఫిక్స్ చేసింది. 119 నియోజకవర్గాల్లో ఒకే గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం నాడు ఆదేశాలు జారీ చేసింది. దీంతో వైఎస్ఆర్‌టీపీ కూడా అభ్యర్థులను ప్రకటించి తమ బైనాక్యులర్ గుర్తును ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు 2018లో అసెంబ్లీ ఎన్నికల తర్వాత వైఎస్ షర్మిలా రెడ్డి తెలంగాణ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఏపీలో అన్న వైఎస్ జగన్‌తో విభేదాలు రావడంతో ఆమె తెలంగాణ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. యువజన శ్రామిక రైతు తెలంగాణ పార్టీ (వైఎస్ఆర్‌టీపీ)ని ప్రకటించి ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారు. తెలంగాణలో 3,800 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన తొలి భారతీయ మహిళగా షర్మిల ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా చేరారు. కాగా తాను స్థాపించిన వైఎస్ఆర్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసేందుకు వైఎస్ షర్మిలారెడ్డి విశ్వప్రయత్నాలు చేశారు. ఈ మేరకు పలుమార్లు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధినేతలు సోనియా, రాహుల్ గాంధీలతో మంతనాలు జరిపారు. అయితే కాంగ్రెస్ పార్టీలో వైఎస్ఆర్‌టీపీ విలీనానికి సంబంధించి దాదాపు నాలుగు నెలల పాటు ఎదురుచూసినా కాంగ్రెస్ నుంచి షర్మిలకు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. దీంతో ఒంటరిగానే ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు షర్మిల సిద్ధమయ్యారు. 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఎన్నికల్లో తాను పాలేరు నుంచి బరిలోకి దిగుతున్నట్లు ఇప్పటికే షర్మిల స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన గిరిజనులు



**హుకుంపేట, (విశాఖ సమాచారమ్):** మండలంలోని కోట్నపల్లి గ్రామ సమీపం బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు బైకులు ఢీ కొన్నాయి. స్థానిక ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని దుర్గం పంచాయతీ పాలమామిడి గ్రామానికి చెందిన తమర్ల వెంకటరావు, సత్యనారాయణలు ద్విచక్ర వాహనం పై హుకుంపేట వస్తున్నారు. కొట్నాపల్లి బ్రిడ్జి సమీపంలో రెండు బైకులు ఢీకొన్నాయి. పాలమామిడి గ్రామానికి చెందిన తమర్ల వెంకటరావు, సత్యనారాయణలకు గాయాల య్యాయి.ఆటోలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెదబయలు రూరల్,పాడేరు: పాడేరు మండలంలోని గుత్తులపుట్టు గ్రామంలో గురువారం జరిగే వారపు సంతకు వివిధ గ్రామాల నుండి వస్తున్న గిరిజనులు ప్రయాణిస్తున్న ఒక జీపు బోల్తా పడింది. పెదబయలు మండలం పరిధిలోని కిముడుపల్లి ఘాట్లో వస్తుండగా జీపు బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. లోయలో పడిన జీపు పల్టీలు కొట్టడంతో ఇందులో ప్రయాణిస్తున్న ఆడ మగ కలిపి 20 మంది గిరిజనులు చెల్లాచెదురుగా పడిపోయారు. క్షత గాత్రులను 108 ద్వారా పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి చేరి చికిత్స పొందుతున్న క్రమంలో పాంగి రాజారావు మృతి చెందారు. క్షతగాత్రుల్లో మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ జీపు ప్రమాదంలో గాయపడిన గిరిజనులంతా పెదబయలు మండలం పులిగొంది గ్రామానికి చెందినవారు.మరో 10 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పరామర్శించారు. మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే తీవ్ర గాయాలతో ఉన్న క్షత గాత్రులను కూడా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# మాజీ ఎమ్మెల్యే దేముడుకు ఘన నివాళి



**కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):** చింతపల్లి మాజీ శాసనసభ్యులు, సిపిఐ నేత గొడ్డేటి దేముడు 8వ వర్ధంతి సందర్భంగా మండలంలోని వెలగలపాలెంలో ఆయన కాంస్య విగ్రహానికి, చిత్ర పటానికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ, దేముడు కుమార్తె గొడ్డేటి మాధవి, పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజన జాతికి గొడ్డేటి దేముడు విశేష సేవలు అందించారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారానూకరాజు, వైస్ ఎంపీపీలు అంబటి నూకాలమ్మ, అప్పన్న వెంకటరమణ, వైసిపి నాయకులు జల్లి బాబులు, గాడి నాగమణి, బండి సుధాకర్, సూరిబాబు, సర్పంచులు నాయుడు, జంపా రాజకుమారి, దొడ్ల రమేష్, రాజు, చందు, నూకాలమ్మ, చిన్నారావు, ఎంపీటీసీలు సిహెచ్.మల్లేశ్వరి, నూకరత్నం, నాయకులు నీలాపు సూరిబాబు, రీమాలి గంగాధర్, సిహెచ్ సావిత్రి, గాడి సత్యనారాయణ, గజ్జయ్య దొర, అచ్యుత్, శేఖర్, రామరాజు, గాడి అచ్చిరాజు, అల్లాడ నగేష్ పాల్గొన్నారు.

**2000 గడియారాలు పంపిణీ**

మాజీ ఎమ్మెల్యే జి.దేముడు 8 వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో అభిమానులు రాగా, సుమారు 2000 మందికి గడియారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దేముడు కుమార్తె, అరకు ఎంపీ మాధవి, ఆమె భర్త, నేను సైతం ఫౌండేషన్ అధినేత శివప్రసాద్ పర్యవేక్షించారు.

# పెరిగిన బంగారం



బంగారం ధర శుక్రవారం స్వల్పంగా పెరిగింది. వెండి ధర మాత్రం నిలకడగా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాములు బంగారంపై రూ. 100 పెరగ్గా, 24 క్యారెట్ల గోల్డ్ పై రూ. 110 పెరిగింది. స్వల్పంగా పెరిగిన క్రమంలో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.56,810 కాగా 24 క్యారెట్ల 10గ్రాముల ధర రూ.61,970గా ఉంది. వెండి ధర మాత్రం నిలకడగా ఉండి కిలో వెండి ధర రూ.78,000గా ఉంది. ఇవాళ హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణంలలో 10 గ్రాముల 22క్యారెట్ల బంగారం రూ. 56,810 కాగా, 24 క్యారెట్ల 10గ్రాముల గోల్డ్ ధర రూ. 61,970కు చేరుకుంది.

## అటకెక్కిన సొంత బస్సుల కొనుగోలు

### పాత బస్సులతోనే ఎపిఎస్ఆర్‌టిసి ప్రయాణాలు




ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేశామని ఆర్భాటంగా చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా ఆర్‌టిసిని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఎపిఎస్‌ఆర్‌టిసికి 11,149 బస్సులు వున్నాయి. ఇందులో 8,743 బస్సులే ఆర్‌టిసివి కాగా, 2,406 బస్సులు అద్దె బస్సులు. గత ప్రభుత్వాల హయాంలో ప్రతియేటా కాలపరిమితి తీరిన బస్సుల స్థానంలో సగటున ఏటా దాదాపు రెండు వేల బస్సులు కొనుగోలు చేసేవారు. ఈ ప్రభుత్వం వచ్చిన నాలుగన్నరేళ్ల కాలంలో ఆర్‌టిసికి ఒక్క సొంత బస్సును కూడా కొనకుండా హైర్ బస్సులనే తీసుకుంటోంది. ప్రతియేటా అద్దె బస్సులను తీసుకోవడం తప్ప ఎపిఎస్ఆర్‌టిసికి సొంతంగా బస్సులు కొనుగోలు చేయకపోవడంతో భవిష్యత్తులో ఆర్‌టిసి మనుగడే ప్రమాదంగా మారుతుందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని సంఘాలు కోరితే టెండర్ల దశలో వున్నాయంటూ ఏడాది కాలంగా ప్రభుత్వం మభ్యపెడుతోంది తప్ప ఎక్కడా బస్సులు కొనుగోలు చేయలేదు. గతంలో ఆర్‌టిసిలో అద్దె బస్సుల రేషియో 15 శాతానికి మించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఏటా కొత్త బస్సులను కొనే పరిస్థితి వుంటే, ఇప్పుడు 30 శాతానికి పైగా అద్దె బస్సులు ఎపిఎస్ఆర్‌టిసిని ఆక్రమించినా రాష్ట్ర ప్రభుత్వం కళ్లుతెరవకపోవడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌టిసిలో దాదాపు 2,400కు పైగా అద్దె బస్సులు వున్నాయంటే ఆర్‌టిసి పరిస్థితి ఏమిటో అవగతమవుతోంది. 15 ఏళ్లు దాటాక వాహనాలను తుక్కు కింద మార్చాలనే కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు ఆర్‌టిసిలో వచ్చే ఏడాది నుంచి అమలులోకి వస్తే వందలాది బస్సులు తుక్కు కింద పక్కన పెట్టేస్తే, ప్రయాణికులను చేరవేసేందుకు బస్సులను నడపలేని స్థితికి ఆర్‌టిసి నెట్టివేయబడుతుంది. ఎపిఎస్ఆర్‌టిసి 3,354 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని పంపిన నివేదికను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి వుంది. ఏడాది కాలంగా కొత్త బస్సుల కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వ వైఖరి అదిగో.. ఇదిగో.. అనడం తప్ప కార్యరూపంలోకి తీసుకురాలేదు. ప్రజల ఆర్థికాభివృద్ధికి కీలకమైన రవాణా వ్యవస్థలో కీలకమైన ప్రజా రవాణాను ప్రభుత్వం నిర్వీర్యం చేయడం తగదని, తక్షణమే కొత్త బస్సులను ఆర్‌టిసికి సమకూర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్

APPSC

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్న దివ్యాంగులకు ఏపీ ప్రభుత్వం ఓ శుభవార్త చెప్పింది. నియామకాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఏపీపీఎస్సీ నిన్న అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ ఆర్డర్ నెం.77 మేరకు ఈ రిజర్వేషన్‌ను అమలు చేయనున్నట్టు పేర్కొంది. ప్రభుత్వ ప్రకటన ప్రకారం, చెవిటివారు, అంధులు, మెదడు పక్షవాతం, కుష్టు, మరుగుజ్జు, యాసిడ్ దాడి బాధితులు, కండరాల బలహీనత, ఆటిజం, మానసిక రోగాల వారిని దివ్యాంగుల జాబితాలో చేర్చారు. అయితే, ఉద్యోగానికి సంబంధించి ఇతర నిబంధనలకు లోబడే రిజర్వేషన్ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇతర ఉద్యోగార్హతలతో పాటుగా 100 శాతం దివ్యాంగులై ఉండాలని పేర్కొంది. దివ్యాంగుల కమిషన్ వెబ్‌సైట్‌లో లబ్ధిదారులు తమ పేరు రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది.



## ఆంధ్రప్రదేశ్‌లో కమల వికాసం ఎప్పుడో ........!? అవసరం (రాజకీయ పార్టీల చరిత్ర)

నూకల సూర్యప్రకాష్

(నిన్నటి తరువాయి)

ఎదురు నిలిచి పోరాడింది. అందుకే తిరిగి 1989, 2004, 2009 లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

కానీ రాష్ట్రంలో బి.జె.పి. మాత్రం తెలుగుదేశం పార్టీకి లబ్ధి చేకూర్చాలనే తాపత్రయం వున్న నాయకుల రాజకీయం కారణంగా, తెలుగుదేశం పార్టీ బలాన్ని బూచిగా చూపి, పొత్తులతో దాని పంచన చేరింది. మిత్ర లాభాన్ని తెలుగుదేశానికి కట్టబెడుతూ రాష్ట్రంలో బి.జె.పి. ఆత్మహత్య చేసుకుంది. బలం లేని మిత్రుడికి బలం ఇచ్చి, తన బలాన్ని తగ్గించుకుంటూ అణగారిపోయింది.

ఈ రకంగా పొత్తుల కారణంగా అన్ని ఎన్నికల్లో 5% స్థానాలకంటే తక్కువకు పరిమితమవడంతో రాష్ట్ర వ్యాప్తంగా వున్న నాయకులు, కార్యకర్తలు వేరేదారి చూసుకోవడంతో పార్టీ ఇంకా బలహీన పడింది.

పార్టీని అంటిపెట్టుకొని వున్న ఆ 10మంది నాయకులు పార్టీని బలోపేతం చేస్తే, కొత్త నాయకులు పుట్టుకొస్తే పొత్తులో పార్టీకి కేటాయించే ఆ 4 స్థానాల్లో వారు తమకు పోటీ వస్తారని ఆలోచించే పార్టీని రాష్ట్రంలో ఎదగనివ్వలేదా? ఈ ఆలోచనే నిజమైతే, అది పార్టీకి ఆత్మహత్యా సదృశమే అవుతుంది.

భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా పోరాటాలతో విస్తరిస్తూ, జైత్రయాత్ర చేస్తూవుంటే, రాష్ట్ర నాయకత్వంలో పోరాట పటిమ లేని కారణంగా కేంద్ర నాయకత్వం కూడా దేశ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా పొత్తులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, పార్టీ రాష్ట్రంలో ఎదగకపోవడానికి ఒక కారణమయ్యింది.

పొత్తులుదేనికోసం? ఉనికిని నిలుపుకోవడం కోసం స్వతంగా గెలవలేనప్పుడు కనీసం పొత్తులతోనైనా ఉనికి కాపాడుకొని భవిష్యత్‌లో ఎదగడం కోసం.

కానీ! జరిగిందేమిటి? కేంద్రంలో పూర్తి మెజార్టీతో శక్తివంతంగా అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రంలో పొత్తులతో నాలుగు స్థానాలు గెలుచుకున్నాం. సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రి పదవులు తీసుకున్నాం. మన లక్ష్యాన్ని మరిచిపోయాం, పార్టీని పూర్తిగా వదిలేసాం. కార్యకర్తలను ప్రక్కన పెట్టేసాం. ప్రజల పక్షాన్న నిలచి ఉద్యమాలు చేయడం మానేసాం. మిత్రపక్షం రాజకీయానికి బొక్కబోర్లాపడ్డాం. మనం తెలుసుకొనే లోపులోనే మిత్ర ద్రోహం జరిగిపోయింది.

పొత్తులతో గెలిచినవారు పార్టీని బలోపేతం చేయడం మాట ప్రక్కన పెడితే, కనీసం వారి స్థానాన్ని అయినా మెరుగుపరుచుకోగలిగారా? కనీసం పోటీ ఇవ్వగలిగే స్థితికైనా వచ్చారా? దీనిని మన రాష్ట్రంలోని నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలి.

**స్థిరం లేనివారితో పొత్తులు అవసరమా?**

బి.జె.పి.కేంద్ర నాయకత్వం రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలోని పరిణామాలను పరిశీలించకుండా, నిర్ణయాలు తీసుకోకూడదు. స్థిరత్వం లేని పార్టీలతో పొత్తులు ఎప్పటికైనా ప్రమాదమే. ఒకసారి పొత్తులు కాదని వెళ్ళిపోయిన ఏ పార్టీతోనైనా పొత్తులు శ్రేయస్కరం కాదు. ఈ విషయాలను కేంద్ర నాయకత్వానికి రాష్ట్ర నాయకులు వివరించగలగాలి.

**ప్రజల మనస్తత్వం కూడా ఒక కారణమేనా ?**

ఆంధ్రులు వ్యక్తిగత అభివృద్ధికి ఇచ్చినపాటి ప్రాముఖ్యత సామూహిక విషయాలకు ఇవ్వరు. అందుకే ఆంధ్రులు భాషను వదులుకున్నారు, రాష్ట్రాన్ని కాపాడుకూలేకపోయారు. రాజధానిని పోగొట్టుకున్నారు, జాతిని రక్షించుకోలేకున్నారు, జాతీయతను మరిచిపోతున్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను వీరు పాటించరు, పిల్లలకు నేర్పరు. చరిత్రను గుర్తుపెట్టుకోరు. ఇది విచిత్రమైన ఆంధ్రుల మనస్తత్వం. అందుకే ఇంట్లో దేవుడ్ని పూజిస్తారు. బయటకు వచ్చి నాస్తిక మహాసభల్లో ప్రసంగిస్తారు. హిందువునని చెప్పుకుంటారు దేవాలయానికో, దేవతా విగ్రహాలకు అపచారం జరుగుతుంటే నాకు సంబంధం లేదని ప్రక్కనుండి వెళ్ళిపోతారు. అందుకే ఏమి జరిగినా ప్రతిఘటనా లేదు, పోరాటాలు అంతకన్నా లేవు. ఇంతకంటే ఆత్మ వంచన ఏముంటుంది?

అందుకే ఆంధ్రులలో విశ్వాసం ఒకటుంటుంది, వారి వ్యవహారం ఇంకోటుంటుంది. చివరకు వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలకే ఓటు వేస్తారు. నాయకుల దగ్గర నుండి ప్రజల వరకు అందరిదీ ఇదే సరళి. దీనికి తోడు కులగజ్జి అన్నిటిని మించిపోయి వుంటుంది. కులగజ్జి ఎంతెలా వుందో మనం వేరే చర్చించుకోవలసిన అవసరం లేదు. ఎందుకంటే ఆ కంపు ఎంతో నిబద్ధత కలిగిన జాతీయవాద భారతీయ జనతా పార్టీకి కూడా పాకిందంటే మన రాష్ట్రంలో కులగజ్జి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎప్పుడో చనిపోయిన ఒక రాజకీయ పార్టీ నాయకునికి, ఇప్పుడు ఏర్పడిన ఒక పార్టీకి ఏ సంబంధం లేకపోయినప్పటికి వీరి కులం అవడం వలన వారి ఫోటో వేసుకొని వారి పేరు చెప్పుకోవడం కులగజ్జికి పరాకాష్ట.

అలాగే తమ కులం వారు వేరే పార్టీలో వుంటే తమ స్వంత పార్టీ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తూ వారి కులం పార్టీకి ప్రయోజనాలు కలిగించేటంత కులగజ్జి ఆంధ్రులలో పెరిగిపోయింది.

**ఎందుకు సోనియాగాంధిగారు ప్రధాని కాలేపోయారు?**

2004 లో కాంగ్రెస్ నేతృత్వంలోని యు.పి.ఎ.కి మెజార్టీ వచ్చినా, సోనియాగాంధి ప్రధాని కాలేకపోయారు. కారణం విదేశీయురాలు కావడం ఎందుకంటే అత్యున్నత పధవులు, నిర్ణయాత్మక పధవులలో బయటినుండి వచ్చిన వారు అంటే వారు కోవర్టులుగా వ్యవహరించి, దేశానికి నష్టం కలిగించే అవకాశం ఉందని అనర్హులుగా నిర్ణయించారు.

మరి పార్టీలో కూడా కీలక పదవులలోకి ఇతర పార్టీల నుండి వచ్చిన వారిని నియమిస్తే ఏమౌతుంది? పూర్వపార్టీ ఎజెండాను అమలు చేయడానికి, కోవర్టులుగా ఈ పార్టీని దెబ్బతీయడానికి అవకాశముంది.

పార్టీ మారి వచ్చేవారు ముందు పార్టీ భావజాలాన్ని వదులుకోలేరు, కొత్త పార్టీ భావజాలాన్ని వంటపట్టించుకోలేరు. పాలు, నీళ్ళుగా కలవలేరు. నీళ్ళు, నూనెగా ఉండిపోతారు. పార్టీ మారి వచ్చేవారిని తీసుకోవచ్చు, కాని వారిని రాజ్యాంగ పదవులకు మాత్రమే పరిమితం చేయాలి. కానీ పార్టీ పదవులు ఇవ్వకూడదు. **(మిగతా రేపటి సంచికలో)**

# వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం... కార్పొరేటర్ శ్రీనివాస్



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** బాబుతో నేను కార్యక్రమం లో 79 వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని లంకెలపాలెం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అక్రమంగా అరెస్టు చేశారని, 46రోజులుగా జైల్లో పెట్టి ఈ సైకో రెడ్డి సునకానందం పొందుతున్నాడని, వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని అన్నారు. 27 కోట్లు స్కిల్ డెవలప్మెంట్ లో చేతులు మారాయని ఎటువంటి ఆధారాలు చూపకుండా నిర్దోషి అయిన చంద్రబాబు నాయుడు ని అరెస్టు చేశారని ఆయన అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి, 10 సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్న వ్యక్తి, 73 సంవత్సరాలు వయసుగల వ్యక్తిని ఈ విధంగా హింసించటం తీవ్ర అన్యాయమని దుయ్యా బెట్టారు. చంద్రబాబు నాయుడు రోడ్ షోలో ప్రజల ఆదరణ, నారా లోకేష్ యువగలం ఆదరణ, పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రజల ఆదరణ చూసి ఓర్వలేక ఈ సైకో రెడ్డి అక్రమ కేసులు పెట్టి అరెస్టుల పర్వం మొదలుపెట్టాడని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు ఎర్ర కోటేశ్వరరావు, దాసరి రామారావు , డి అర్జున్ , రౌతు వరాహనరసింహమూర్తి, కర్రీ జువ్వాలు, గంగిరెడ్ల కాలనీ నాయకులు ధనకొండ చందర్రావు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో మహిళలు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు అవసరమగు భూ సమస్యలను పరిష్కరించాలి



**విజయనగరం:** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పెండింగ్ ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ను కలసి ఎ.పి.ఐ.ఐ.సి, పరిశ్రమల శాఖ, ఆర్.డి.ఓ వెంటనే భూ సంబంధిత అంశాల పై చర్చించుకొని పరిష్కారాన్ని చేయాలన్నారు. ముఖ్యంగా కొత్తవలస మండలం రెల్లి లో 158 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్ , పెదరావు పల్లి గ్రామం లో నున్న 70 ఎకరాల డి. పట్టా భూములు , కంటకాపల్లి భూముల అలియనేషణ్ కు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్.డి.ఓ సూర్య కళ కు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ పి ఎం ఈ జి పి క్రింద ఆయా సంస్థలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సింగల్ డెస్క్ పోర్టల్ క్రింద పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను గడువు లోగా పరిస్కారం చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గత సమావేశం నుండి ఈ సమావేశం వరకు నెల రోజుల్లో 81 దరఖాస్తులు అందగా 48 దరఖాస్తులకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, 29 దరఖాస్తులు వేర్వేరు శాఖల వద్ద పెండింగ్ ఉన్నాయని, 4 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని డి.ఐ.సి జనరల్ మేనేజర్ పాపా రావు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ గడువు లోగా ఆయా శాఖల వారు పరిష్కరించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను పేర్కొనాలని తెలిపారు.

ఈ సమావేశం లో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్.డి.ఓ సూర్య కళ, జిఎం డి.ఐ.సి పాపా రావు, ఎ.పి.ఐ.ఐ.సి జిఎం యతిరాజు, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్స్పెక్టర్ అఫ్ ఫాక్టరీస్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కష్టాలు చెప్పుకొని బాలినేని కన్నీళ్లు

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** 'నీకే కాదు. మా పరిస్థితీ బాగోలేదు. మా గోడు ఎవరికి చెప్పుకోవాలి! జగన్ నాతో కూడా సరిగా మాట్లాడటంలేదు. నన్ను, షర్మిలనూ పట్టించుకోవడంలేదు' అని ముఖ్యమంత్రి జగన్ తల్లి విజయలక్ష్మి ఆవేదన, ఆక్రోశం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈనెల 14వ తేదీన ఆమె ఒంగోలులో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసానికి వెళ్లారు. జగన్ వైఖరిపట్ల ఆయన ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న సంగతి తెలిసిందే. విజయలక్ష్మి ముందు ఆయన తన ఆవేదన వ్యక్తం చేయగా... 'మరి నా గోడు ఎవరికి చెప్పుకోవాలి' అంటూ ఆమె జగన్‌పై తీవ్ర ఆక్రోశం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వైఎస్ రాజశేఖర రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఇద్దరూ తోడల్లుళ్లు.

వైవీ సోదరి భర్తే బాలినేని. వెరసి... వీరంతా జగన్‌కు సన్నిహిత బంధువులు. బాలినేని, వైవీ మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. జగన్ కూడా వైవీకే మద్దతుగా నిలుస్తున్నారని, తనను పట్టించుకోవడంలేదని బాలినేని ఆగ్రహంతో ఉన్నారు. ఇటీవల నకిలీ పట్టాల వివాదంపై సీఎం క్యాంప్ కార్యాలయానికి కూడా వచ్చి ఫిర్యాదు చేశారు. పార్టీకి రాజీనామా చేసేదాకా వెళ్లారు. ఇదే నేపథ్యంలో... అనారోగ్యంతో ఉన్న వైవీ సుబ్బారెడ్డి తల్లిని పరామర్శించేందుకు విజయలక్ష్మి ఈనెల 13న ఒంగోలుకు వెళ్లారు. ఆ మరుసటి రోజు ఉదయం వైవీ సుబ్బారెడ్డి ఇంటికి సమీపంలోనే ఉన్న బాలినేని ఇంటికి కూడా వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువురూ తమకు జరుగుతున్న అన్యాయం, అవమానాలను ఏకరువు పెట్టుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం...

వైవీ సుబ్బారెడ్డి తనను అణచివేస్తున్నారని, జగన్ కూడా ఆయనకే మద్దతు ఇస్తున్నారని విజయలక్ష్మి ముందు బాలినేని ఆక్రోశం వ్యక్తం చేశారు. "నన్ను పిలుస్తారు. తీరా అక్కడికి వెళ్లాక పట్టించుకోరు. ఇంకెవరో వచ్చి మాట్లాడతారు" అని బాలినేని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆయనను విజయలక్ష్మి అనునయించారు. జగన్ తనతో కూడా సరిగా మాట్లాడటంలేదని విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. "నా పరిస్థితి, షర్మిల పరిస్థితి దారుణంగా ఉంది. మేం ఎవరికి చెప్పుకోవాలి! నేను వెళితే నాతో కూడా సరిగా మాట్లాడలేదు. రావాల్సిన వాటా గురించి అడిగినా పట్టించుకోవడంలేదు. కనీస మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నాడు. ఇలా ఎంతకాలం సాగించుకుంటాడో చూద్దాం" అంటూ విజయలక్ష్మి కన్నీళ్లు ఆగ్రహంతో కూడిన వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

**పార్టీ మారే యోచన...**

జగన్ వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీని వీడే యోచనలో ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం తెలిసి... టీడీపీ నుంచి ఆయనకు పిలుపు అందినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాలినేనితో సంప్రదింపులు కూడా జరిపినట్లు తెలిసింది. బాలినేనితోపాటు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మరో ఇద్దరు ముఖ్య నాయకులు కూడా పార్టీ వీడే యోచనలో ఉన్నట్లు తెలియడంతో ఈ సంప్రదింపులకు ప్రాధాన్యం ఏర్పడింది.

**జగన్ నుంచి పిలుపు...**

బాలినేని శ్రీనివాసరెడ్డి అసంతృప్తి, తల్లితో చర్చలు, టీడీపీ నేతలూ టచ్‌లోకి వెళ్లిన సమాచారం సీఎం జగన్‌కు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో... శనివారం వైవీ సుబ్బారెడ్డితో కలిసి తాడేపల్లికి వచ్చి తనను కలవాల్సిందిగా బాలినేనికి కబురు పంపినట్లు సమాచారం. అయితే... వైవీ సుబ్బారెడ్డితో కలిసి వచ్చేదే లేదని, వస్తే ఒంటరిగానే వస్తానని, తనతో మాట్లాడి విషయం తేల్చాలని బాలినేని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీనిపై జగన్ వైపు నుంచి ఇంకా స్పందన కనిపించలేదు.

# జీఎస్టీ వసూళ్లలో అంతా అవినీతే ఆ డబ్బంతా ఏం చేస్తున్నారు?



**విజయవాడ, (విశాఖ సమాచారమ్):** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం తప్పుడు తడకలుగా సాగుతోందని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ సేనలు ఆస్పత్రిపై బాంబులు వేస్తే ప్రధాని మోదీ సమర్థిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం మానవత్వం అయినా చూపరా అంటూ వ్యాఖ్యలు చేశారు. దేశంలో జీఎస్టీ విధానం అస్తవ్యస్తంగా ఉందన్నారు. దేశంలో మూడు వేల రకాల వస్తువులపై జీఎస్టీ పన్నులు వసూలు చేస్తున్నారని.. నెలకు 1.25 లక్షల కోట్లు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ డబ్బు అంతా కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఐదు రకాల స్లాబ్‌లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లలో అంతా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. మరమ్మతుల పైన కూడా జీఎస్టీ ఏమిటని నిలదీశారు. అసలు ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా ట్యాక్స్ లేదన్నారు. జీఎస్టీ అంతా అవినీతిమయంగా మారిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజా స్వామ్యమే లేదన్నారు. మైక్ పర్మిషన్‌కు కూడా కాలుష్య ధృవీకరణ పత్రం ఏమిటని అడిగారు. ఏపీలోనీ విద్యా విధానం మార్పు చేయడం వల్ల ఎస్సీలు, ఎస్టీ, బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. విద్యా విధానం మార్పు చేయడానికి ముఖ్యమంత్రి జగన్ ఏమైనా స్కాలరా అంటూ ఆయన మండిపడ్డారు.

# కుటుంబ సమేతంగా దుర్గమ్మ సేవలో పాల్గొన్న ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని సత్యనారాయణపురం గ్రామ పరిధి కళ్యాణగిరి కొండపై వేంచేసియున్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో కుటుంబ సమేతంగా ఎం.వి.ఆర్ పాల్గొని అమ్మవారికి అభిషేకాలు, పూజలు, అర్చనలు వంటివి నిర్వహించారు. ఈ మేరకు ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఎం వి ఆర్ కు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఎం వి ఆర్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు, దుర్గమ్మ భక్తులు, ఆలయ ప్రతినిధులు, స్థానికులు, ఎంవిఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సవానికివిరాళం అందజేసిన ఎంవీఆర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక నర్సింగరావుపేట ఎంవీఆర్ కార్యాలయం నందు, మాడుగుల నియోజకవర్గం కేజేపురం గ్రామంలో శ్రీ దుర్గా దేవి నవరాత్రులు మహోత్సవం, నిమజ్జన కార్యక్రమానికి ఎం వి ఆర్ చేతుల మీదుగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం వి ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జెండాలు లాక్కున్నారు.. చొక్కాలు విప్పించారు

**రణస్థలం , (విశాఖ సమాచారమ్):** సైకిల్ యాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా పుంగనూరు చేరుకోగానే వైకాపా రౌడీలు తమపై వీరంగం సృష్టించారని రణస్థలం మండలం నారువ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నిద్రబంగి రామకృష్ణ, చిల్ల రామసూరి, ఎస్.ఆదినారాయణ, ఎస్.సుందరరావు, ఎస్.రమేశ్‌లు వెల్లడించారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడి అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని తెదేపా కార్యాలయం నుంచి చిత్తూరు జిల్లా కుప్పం వరకు వారు చేపట్టిన సైకిల్‌యాత్ర దిగ్విజయంగా ముగిసింది. ఈ నేపథ్యంలో గురువారం వారు జిల్లాకు చేరుకోగా.. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన తెదేపా నాయకులు, కార్యకర్తలు పైడి భీమవరం వద్ద ఘనస్వాగతం పలికారు. అనంతరం అయిదుగురినీ సన్మానించారు. ఈ సందర్భంగా యాత్ర చేస్తున్నప్పుడు పుంగనూరులో ఎదురైన చేదు అనుభవాలు, అక్కడి పరిస్థితులను వారు వివరించారు. 'అక్టోబరు 2వ తేదీన సైకిల్ యాత్ర ప్రారంభించాం. 18 రోజులు సాఫీగానే సాగింది. 20న చిత్తూరు జిల్లా పుంగనూరు చేరుకున్నాక మాపై వైకాపా రౌడీలు దౌర్జన్యం చేశారు. మా వద్ద ఉన్న తెదేపా జెండాలు లాక్కున్నారు.. చొక్కాలు విప్పించారు. ఏం చేయాలో తోచక ప్రాణాలు అరచేత పట్టుకుని యాత్ర కొనసాగించాం. అక్కడి పరిస్థితులు చూసి భయమేసింది' అని పేర్కొన్నారు.



శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం వద్ద సైకిల్ యాత్రికులకు స్వాగతం పలుకుతున్న తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు కళా వెంకటరావు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, తదితరులు

**చాలా భయపడ్డాం**

సైకిల్ యాత్ర ప్రారంభించిన తర్వాత అన్ని చోట్లా తెదేపా శ్రేణులు, స్థానిక యువత పూర్తి సహకారం అందించారు. పుంగనూరులో అడుగుపెట్టిన రోజు సాయంత్రం కొందరు వైకాపా గుండాలు వచ్చి గంటసేపు మాపై విరుచుకుపడ్డారు. తీవ్ర ఒత్తిడికి గురయ్యాం. మా వద్ద ఉన్న జెండాలను లాక్కున్నారు. చొక్కాలు విప్పించారు. ఆ సమయంలో చాలా భయపడ్డాం. అక్కడ ఒక్కరు కూడా వారిని ఆపలేదు. స్థానికులంతా వాళ్లకే వత్తాసు పలికారు.

**పలమనేరు చేరుకున్నాక ధైర్యం వచ్చింది**

పుంగనూరులో ఉన్నంత సేపు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని యాత్ర కొనసాగించాం. యాత్ర ఎక్కడ నిలిచిపోతుందోనని ఆందోళనకు గురయ్యాం. మా వద్ద నుంచి పార్టీ జెండాలు, ఇతర సామగ్రి తీసుకుని పంపించేశారు. పుంగనూరు దాటి పలమనేరు చేరుకున్నాక ధైర్యం వచ్చింది. అక్కడ నుంచి మా వెంట తెదేపా కార్యకర్తలు, యువత తోడుగా నిలిచారు. అడుగడుగునా నీరాజనం పట్టారు. వారికి జీవితాంతం రుణపడి ఉంటాం.

**అక్కడి వారు ఎలా ఉంటున్నారో**

యాత్ర సాఫీగా సాగిపోతుంది అనుకున్నాం. కానీ పుంగనూరులో ఇంత రౌడీయిజం చేస్తారని ఊహించలేదు. మంత్రి అనుచరులమని చెప్పి మమ్మల్ని బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డారు. మేం వేసుకున్న పసుపు రంగు దుస్తులు తీసేయమన్నప్పుడు చాలా బాధేసింది. అలాంటి పరిస్థితుల్లో అక్కడ ఉన్నవారు ఎలా ఉంటున్నారో అర్థం కావట్లేదు.

**రౌడీయిజాన్ని ప్రత్యక్షంగా చూశాం**

పుంగనూరులో రౌడీయిజాన్ని ప్రత్యక్షంగా చూశాం. రెండు కార్లపై వచ్చి మమ్మల్ని చుట్టుముట్టారు. ఆ ప్రాంతంలో సైకిల్ యాత్ర చేయడానికి వీల్లేదని దౌర్జన్యం చేశారు. మేం ఏం చెప్పినా వినలేదు. వారు చెప్పిందే వినాలంటూ దుర్భాషలాడారు. కొన్ని గంటల పాటు ఏం జరుగుతుందో మాకు అర్థం కాలేదు. ఈ విషయం మా కుటుంబసభ్యులకు తెలిసి భయాందోళనలకు గురయ్యారు.

## కొత్త సబ్ ఇన్స్పెక్టర్ ను కలిసిన వేంపాడు గ్రామ పెద్దలు



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి పోలీస్ స్టేషన్ నూతన హౌస్ ఆఫీసర్ గా బాధ్యతలు చేపట్టిన ఇన్స్పెక్టర్ విభూషన్ రావు ని మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారుఎస్ ఐ మాట్లాడుతూ పెండింగ్ కేసులు అన్నీ పరిష్కారం చేస్తామని ఎటువంటి అవంచానేయ సంఘటనలు జరగకుండా చూస్తామని మీరంతా సహకరించిన యెడల మేము పూర్తి న్యాయం చేస్తాను అని అన్నారు వేంపాడు ఎంపీటీసీ కుంచే మధు, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, గ్రామ తెలుగుదేశం పార్టీఅధ్యక్షుడు కమ్మిళ శివరామకృష్ణన్ రాజు, ఉపాధ్యక్షుడు పల్లా రాంబాబు,దారబాల బుజ్జి, ఇసరపు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ మోహన్ రెడ్డి పాలనలో రెడ్లకే సామాజిక న్యాయం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రాష్ట్రం లో ఎక్కడ ఎస్సీ ఎస్టీ, బీసీల భూములను ఉన్నాయో గుర్తించి దోచుకోవడం కోసమే వైకాపా మంత్రుల బస్సు యాత్ర చేపడుతున్నారు అని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. ఉత్తరాంధ్రా జీవనాడి అయిన సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం ఉత్తరాంధ్రా వైకాపా మంత్రులు ఎమ్మెల్యేలు ఎందుకు బస్సు యాత్ర చెయ్యలేదని ప్రశ్నించారు. వైకాపాది బస్సు యాత్ర కాదని ఇది తుస్సు యాత్ర అని ఏద్దేవ చేశారు.

.ఉత్తరాంధ్రా ప్రజలపై దండ యాత్ర చేయడమే వైకాపా లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

శుక్రవారం అనకాపల్లి పట్టణం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పత్రికా ప్రకటన చేశారు.జగన్ మోహన్ రెడ్డి పాలనలో రెడ్లకే సామాజిక న్యాయం జరిగిందని అన్నారు.

దళిత వైద్యుడు సుధాకర్, దళిత కారు డ్రైవర్ ఎమ్మెల్సీ అనంత బాబు చంపినప్పుడు ఎందుకు మంత్రులూ స్పందించ లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీలపై దాడులు అక్రమ కేసులు తప్పా సామాజిక న్యాయం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ళ సురేంద్ర, కాయల మురళి, ఆళ్ళ రామచంద్రా రావు, తలారి కాశీ నాయుడు, కరణం రమణ, కరణం పవన్ కుమార్, బత్తుల శ్రీనివాసరావు, ఆళ్ల జగన్, భాను చంద్ర అఖిల్, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## హిమాచల్ సీఎంకు అస్వస్థత-ఎయిమ్స్‌కు తరలింపు



శిమ్లా: అస్వస్థతకు గురైన హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖును దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. వైద్య పరీక్షల నిమిత్తం శుక్రవారం ఆయన్ను ఎయిమ్స్‌కు తీసుకెళ్లినట్లు ఇందిరా గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (IGMCH) మెడికల్ సూపరింటెండెంట్ వెల్లడించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఆరోగ్యం నిలకడగా ఉందని, అన్ని నివేదికలు సాధారణంగానే ఉన్నాయని చెప్పారు.

బుధవారం రాత్రి నుంచి అన్ని రకాల పరీక్షలు చేశాం. కడుపులో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు బయటపడింది. మరిన్ని వైద్యపరీక్షల నిమిత్తం దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించాం' అని తెలిపారు. శిమ్లాలో సీఎంను పరీక్షించిన వైద్యబృందం కూడా ఆయన వెంట వెళ్లింది. బుధవారం రాత్రి సుఖ్విందర్ సింగ్ అస్వస్థతకు గురయ్యారు. పొత్తికడుపులో నొప్పితో ఆసుపత్రిలో చేరారు. 'గత కొద్దిరోజులుగా సీఎం విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కొన్నిసార్లు బయట ఆహారం తీసుకోవాల్సి వచ్చింది. దానివల్లే ఆయన ఇన్ఫెక్షన్‌కు గురయ్యారు' అని సుఖు ప్రధాన మీడియా సలహాదారు వెల్లడించారు.

## బస్ టిక్కెట్‌కు డబ్బులు లేక పాత సైకిల్‌పై కాలేజీకి వెళ్లా : ఇస్రో చీఫ్ సోమనాథ్

చంద్రయాన్-3 మిషన్ విజయంలో కీలక పాత్ర పోషించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చీఫ్ ఎస్.సోమనాథ్ స్వయంగా రచించిన ఆయన ఆత్మకథ ఈ నవంబర్‌లో విడుదల కానుంది. తన మాతృభాష మలయాళంలో ఈ పుస్తకాన్ని రాసినట్టు ఆయన చెప్పుకొచ్చారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తాను చదువుకునే రోజుల్లో ఎన్నో కష్టాలు పడ్డానని తెలిపారు. అవన్నీ పుస్తకంలో అక్షరబద్ధం చేసినట్టు వివరించారు. ఈ పుస్తకం ద్వారా నా జీవన ప్రయాణంలో జరిగిన విషయాలను పాఠకులకు వివరించడం నా ఉద్దేశం కాదు. జీవితంలో కష్టాలను ఎదుర్కొంటూనే తమ తమ స్వప్నాలను సాకారం చేసుకోవాలని ప్రేరేపించడం మాత్రమే అని ఆయన వివరించారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన తనకు ఈ దేశం ఎన్నో అవకాశాలను ఇచ్చిందన్నారు. రాకెట్ తయారీ, పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ మార్క్ 3, చంద్రయాన్-3 మిషన్ తదితర అంతరిక్ష మిషన్‌ల అనుభవాలు, ఇస్రోలో తన ప్రయాణాన్ని ఈ పుస్తకంలో సోమనాథ్ వెల్లడించారు. కాలేజీ రోజుల్లో బస్సు చార్జీలకు ఆయన వద్ద డబ్బులు ఉండేవి కావట. దీంతో, పాత సైకిల్‌పైనే కాలేజీకి వెళ్లేవారట. డబ్బులు లేక ఓ చిన్న హోటల్ గదిలో ఉండేవాడినని సోమ్‌నాథ్ తన పుస్తకంలో రాసుకొచ్చారు. కుటుంబంలో ఆర్థిక సమస్యల కారణంగా స్టడీ టూర్‌లకు వెళ్లలేకపోయేవాడినని ప్రస్తావించారు.

సోమనాథ్ స్వస్థలం కేరళలోని అళప్పుఝ జిల్లా. కొల్లంలో టీకేఎం కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన సోమనాథ్ బెంగళూరులోని ఐఐఎస్సీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. 1985లో విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్‌లో చేరారు. అక్కడ ఉపగ్రహ వాహకనౌకల డిజైనింగ్‌లో కీలకపాత్ర పోషించారు. 2010-14 మధ్య జీఎస్ఎల్వీ మార్క్-3 డైరెక్టర్‌గా శాటిలైట్ల అభివృద్ధికి సంబంధించి పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. వీఎస్ఎస్సీ డైరెక్టర్‌గానూ చేశారు.

## భారతీయులకు బైడెన్ మరో తీపి కబురు



విదేశీ వృత్తి నిపుణులకు ముఖ్యంగా భారతీయులకు ప్రయోజనం కలిగించే మరో నిర్ణయాన్ని బైడెన్ ప్రభుత్వం తీసుకుంది. ఇటీవలే హెచ్-1బీ వీసా జారీ ప్రక్రియలో బైడెన్ యంత్రాంగం పలు ప్రతిపాదనలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, గ్రీన్ కార్డులకు సంబంధించి కీలక సిఫార్సులు చేసింది. గ్రీన్ కార్డు దరఖాస్తు ప్రాథమిక దశలోనే ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డు (ఈఏడీ), అవసరమైన ట్రావెల్ డాక్యుమెంట్లను జారీ చేయాలని వైట్‌హౌస్ కమిషన్ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను ఆసియన్-అమెరికన్, నేటివ్ హవాయియన్, పసిఫిక్ వ్యవహారాల (ఏఏపీఐ) శ్వేతసౌధ కమిషనర్ ఆమోదం తెలిపారు. ఈ ప్రతిపాదనలకు అధ్యక్షుడు జో బైడెన్ ఆమోదిస్తే వేలాది విదేశీ వృత్తి నిపుణులు ముఖ్యంగా భారతీయులకు భారీ ప్రయోజనం కలగనుంది. ప్రస్తుతం గ్రీన్ కార్డు ఆమోదానికి దశాబ్దాల సమయం పడుతున్న విషయం తెలిసిందే. గ్రీన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారిలో ఎక్కువ మంది భారతీయులే ఉన్నారు. అయితే, గ్రీన్ కార్డు దరఖాస్తు ప్రక్రియలో పలు దశలుంటాయి. ఉద్యోగి తరపున సంస్థ యజమాన్యాలు తొలుత I-140 అప్లికేషన్‌ను సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం అత్యంత కీలకమైన దశ స్టేటస్ సర్దుబాటు. దీనిని I-485. పిలుస్తారు. ప్రస్తుతం I-485 దశలో ఈఏడీ కార్డును జారీ చేస్తున్నారు. దాంతోపాటు ట్రావెల్ డాక్యుమెంట్ల అడ్వాన్స్ పెరోల్ ఇస్తారు. వీటి సాయంతో తన గ్రీన్ కార్డు ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఉద్యోగి ఎక్కడైనా పని చేయవచ్చు. ప్రస్తుతం కొత్త సిఫార్సుల ప్రకారం ఐ-140 దశలోనే ఈఏడీ కార్డు, ట్రావెట్ డాక్యుమెంట్లను జారీ చేస్తారు. గ్రీన్ కార్డు అనేది అమెరికాలో విదేశీయులకు శాశ్వత నివాసం కల్పిస్తుంది. ఈఏడీ సిఫార్సులపై వైట్‌హౌస్ కమిటీ సభ్యుడైన భారతీయ అమెరికన్ కమ్యూనిటీ నేత అజయ్ జైన్ భుటోరియా మాట్లాడుతూ సిఫార్సులను అమలు చేయడం వల్ల యజమాన్యాల మధ్య పరిమితులు లేకుండా స్వేచ్ఛను పొందవచ్చు. ఉద్యోగులు, ఆర్థిక వ్యవస్థ రెండింటికీ ప్రయోజనం చేకూరుతుంది. ముందస్తు పెరోల్ పొందడం ద్వారా ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. అమెరికా రాయబార కార్యాలయాల్లో వీసా అపాయింట్‌మెంట్ బ్యాక్‌లాగ్‌లను నివారించడం స్వదేశాలలో వృద్ధాప్య తల్లిదండ్రుల సంరక్షణకు మద్దతు ఇస్తుంది అని అన్నారు. ఇది శ్రామిక శక్తి కొరతను కూడా పరిష్కరిస్తుంది ముఖ్యంగా హెల్త్‌కేర్, గ్రామీణ వర్గాలలో అంతరాలను తగ్గించడం, ప్రత్యేక ఉద్యోగాలకు కవరేజీని అందించడం వంటి క్లిష్టమైన రంగాలలోని సమస్యల కూడా ఇది పరిష్కరిస్తుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత విధానం ప్రకారం ఉద్యోగి వివక్ష, దోపిడిని ఎదుర్కొంటూ అనేక సంవత్సరాల పాటు ఒకే యజమాని వద్ద ఒకే స్థానంలో పని చేస్తూనే ఉంటాడు. తరచుగా వారు తమ నైపుణ్యాలు, సామర్థ్యం, అనుభవం కంటే తక్కువ వేతనాలకే పనిచేస్తారు. జాబ్ పోర్టబిలిటీ చాలా తక్కువగా ఉంది. ఒకరు ఒక యజమాని నుంచి మరొక యజమానికి సులభంగా మారలేరు. ఇది వ్యక్తి, వారి కుటుంబాలపై ఒత్తిడి, అసంతృప్తి సృష్టిస్తుంది అని భుటోరియా అన్నారు. వీసా బ్యాక్‌లాగ్‌లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు వేచి ఉన్నారు, వారి స్థితి సర్దుబాటు కోసం దరఖాస్తులను దాఖలు చేసినా దానితో సంబంధం లేకుండా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీకి చెందిన అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ EB-1, EB-2, EB-3లో ఐ-140 ఉపాధి ఆధారిత వీసా దరఖాస్తులను ఆమోదించిన వ్యక్తులకు ఉద్యోగ అధికార పత్రాలు, ప్రయాణ పత్రాలను మంజూరు చేయాలి అని అన్నారు. కాగా, ఏటా పరిమితి సంఖ్యలోనే అమెరికా గ్రీన్ కార్డులను జారీచేస్తోంది. చైనా, ఫిలిప్పీన్స్, భారత్ సహా ఏఏపీఐ దేశాలకు చెందిన వారి 1.8 మిలియన్ దరఖాస్తులు పేరుకుపోయాయి. వీటి ఆమోదానికి 5 నుంచి 20 ఏళ్లు కొన్నింటికి 50 ఏళ్లు కూడా పడుతోంది.

## అమెరికా విమానానికి చేరువగా చైనా ఫైటర్ జెట్
### వీడియో రిలీజ్ చేసిన మిలిటరీ

న్యూయార్క్: దక్షిణ చైనా సముద్రం మీదుగా అమెరికా విమానానికి (B-52) 10 అడుగుల దూరంలో చైనా ఫైటర్ జెట్ ఎగిరిందని అమెరికా ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోను యూఎస్ మిలిటరీ విడుదల చేసింది. ఫైటర్ జెట్ (J-11) అకస్మాత్తుగా రావడంతో గాల్లోనే రెండు ఫ్లైట్స్ ఢీకొని పెను ప్రమాదం జరిగేదని తృటిలో ప్రమాదం నుంచి బయటపడినట్లు అమెరికా అధికారులు తెలిపారు. గగనతలంలో దక్షిణ చైనా సముద్రంపై అమెరికాకు చెందిన విమానం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. చైనా పైలట్ మితిమీరిన వేగంతో ఫ్లైట్ నడిపాడని అమెరికా ఆరోపించింది. వీడియోలో అమెరికన్ జెట్ రెక్కకు దిగువ భాగన చైనీస్ ఫ్లైట్ వెళ్తుండటం కనిపిస్తోంది.

అంతర్జాతీయ వాయు భద్రతా నియమాలు, నిబంధనలకు విరుద్ధంగా చైనా ప్రవర్తించిందని యూఎస్ మిలిటరీ ఆరోపించింది. తూర్పు, దక్షిణ చైనాలోని గగనతలంలో పని చేస్తున్న అమెరికా విమానాలకు వ్యతిరేకంగా చైనా సైన్యం ఏడాదిన్నర కాలంగా ప్రమాదకర విన్యాసాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన 15 ఫొటోలను అమెరికా విడుదల చేసిన కొన్నాళ్ల తరువాత తాజా ఘటన చోటు చేసుకుంది. కాగా, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మూడు రోజుల పర్యటన నిమిత్తం వాషింగ్టన్ చేరుకున్నారు. ఆయన అమెరికా విదేశాంగ కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్‌ను కలుసుకున్నారు. ఇరు దేశాలు పలు అంశాలపై చర్చించుకున్నట్లు అధికారులు తెలిపారు.

## మాటల్లో కులగణన - పోటీలో అగ్రవర్ణాలు

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రారంభించిన బి.సీ. కులగణన ఇండియా కూటమికి ప్రధాన ఎజెండాగా ఉంది. దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణంగా జరగాలంటే కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సి.డబ్ల్యూ.సి. తీర్మానించడం ఒక చారిత్రకమైన మలుపు. అంతేగాక రాహుల్ గాంధీ ఇప్పుడు మా ముఖ్యమంత్రులలో బీ.సీ.లే ఎక్కువ ఉన్నారని ప్రకటించాడు. కర్నాటకలో సిద్ధరామయ్య, రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాత్, చత్తీస్‌ఘడ్‌కి భూపేష్ భగెల్, హిమాచల్ ప్రదేశ్‌కు సుఖ్వీందర్ సుక్కు నలుగురు బలహీన వర్గాలకు సంబంధించిన వారేనని, అంతేగాక వీరితో కలిసి ఆయన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడటం సామాజిక న్యాయ దిశగా ప్రయాణంగా కనిపిస్తుంది. ఈ సందర్భంగా ఐదు ముఖ్యమైన రాష్ట్రాల్లో ఎన్నికల జరగటం ఒక సందర్భం. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మిజోరం, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఐదు రాష్ట్రాల్లో దగ్గర దగ్గర 16.14 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 8.2 కోట్ల మంది పురుషులు, 7.8 కోట్ల మంది మహిళలు. అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 5.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో దళిత బహుజన మైనార్టీలే 85 శాతం. అయితే అభ్యర్థులుగా నిలబడుతున్న వారు మాత్రం మెజార్టీ వర్గం అగ్రకులాలుగా ఉన్నారు.

డబ్బు, మద్యం నియంత్రించడానికి ఈ నాలుగు రాష్ట్రాల్లో 970 చెక్‌పోస్టులు పెట్టామని చెబుతున్నారు. నిజానికి ఎన్నికలు మొత్తం మద్యం, మాఫియా, డబ్బు పంపిణీలో మునిగిపోయిందని అందరికి తెలుసు. ఎన్నికల బరిలో కోటీశ్వరులు, ధనవంతులు, మత్తు మందుల మాఫియాలు, నల్లధనం కుబేరులు, అవినీతి సామ్రాట్‌లు, కల్తీ వ్యాపారులు, విద్యా వ్యాపారులు దేశాన్నే, ప్రపంచాన్నే ముంచగలిగిన అవినీతిపరులు, నీతి, నిజాయితిలేని, వ్యక్తిత్వం లేని, సామాజిక న్యాయం, ధర్మం లేని, జీవితానికి ఒక క్రమం లేని వారు ఎక్కువమంది పోటీ చేస్తున్నారు. హత్యలుచేసి కేసులుమాఫీ చేయించుకున్నవారు, స్త్రీలపై అఘాయిత్యంచేసి కేసుల్లో ఉన్నవారు ఎన్నికల్లో భారీగా ఉన్నారు. ఈ దుర్గుణాలకి పార్టీల భేదం లేదు. అందులో ఉన్నవారు ఇందులో ఉంటారు. ఆ పార్టీలో ఉన్నవారు టికెట్ లేకపోతే రెండో రోజే జంప్ అవుతారు. ఎక్కువ మందికి రాజనీతి లేదు. రాజ్యాధికారాన్ని ఒక దోపిడిగా భావించారు. కొన్ని ప్రాజెక్టులను దశాబ్ధాలుగా పూర్తికాకుండా ఆ డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు. సామాజిక న్యాయానికి దూరంగా బ్రతుకుతున్న పార్టీలు ఇవన్నీ, ఇంతకుముందు ఇచ్చిన మానిఫెస్టోనే మరలా క్రొత్తగా వాటినే ప్రకటిస్తారు. అందుకే అంబేద్కర్ రాజ్యాంగాన్ని పూర్తిచేసిన తరువాత చేసిన ప్రకటన చాలా విలువైనది. 1950 జనవరి 26 నుంచి వైరుధ్యాల జీవితంలోకి మనం అడుగు పెట్టాము. రాజకీయాల్లో సమానత్వం, ఆర్థిక, సాంఘిక జీవితాల్లో అసమానత్వం. ఈ వైరుధ్యాలను తొలగించకపోతే అసమానత్వంతో బాధపడుతున్న ప్రజలు ఈ రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థను పేల్చివేస్తారు అని హెచ్చరించారు. ఇది చాలా వాస్తవమైన ప్రకటన. రాజ్యాంగం ఇచ్చిన హక్కును గౌరవించలేని అంధత్వం నేటి కుళ్లిన రాజకీయవ్యవస్థను వెంటాడుతోంది.

సామాజిక అసమానత్వం పునాదులు కూల్చాలంటే ఎదుగుతున్న వాణ్ణి గౌరవించి అభిమానించే మానసిక పరిపక్వత పెరగడమే ముఖ్యం. దీనికి కులం అడ్డువస్తుంది. చారిత్రక అవగాహనలేకపోవడం కూడా దీనికి కారణం. అంబేద్కర్ తన రాజకీయ ప్రజాస్వామ్యంలో భారతదేశానికి బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారి వాదాలను శత్రువులుగా ప్రకటించాడు. బ్రాహ్మణవాదం అంటే ఇది బ్రాహ్మణులకు పరిమితమైంది కాదు. నా కులమే అన్ని కులాల కంటే అధికమైందనే భావం, ఆ కుల భావంతో ఇతరులను కించపరచడం రెండవది. నేను, నా కుటుంబం, నా కులం మాత్రమే ఆర్థికంగా పైకి రావాలని ఆలోచించడం. కులాన్ని, కుటుంబాన్ని దాటలేనివాడు రాజనీతిజ్ఞుడు కాలేడు. డా॥బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలు ఆనాటి నుండి ఈనాటి వరకు సమకాలీనంగానే ఉండడానికి కారణం సమాజంలో మార్పు చాలా ఆలస్యంగా జరుగుతోంది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కూడా బి.సి.లకు మొదటి నుండి అన్యాయం చేస్తూనే వచ్చింది. మండల్ కమీషన్ నివేదికలో బి.సి.లకు ఎన్నో సంస్కరణలు ప్రాతిపాదించారు. 1951లో రాజ్యాంగంలో 15(4), 16(4) క్లాజులను పొందుపరచి రాజ్యాంగ పరంగా బి.సి. రిజర్వేషన్లకు వున్న అడ్డంకి తొలగించారు. అక్కడి నుండి 1978 వరకు పరిపాలనలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం బి.సి.లను తమ రాజకీయ చదరంగంలో పావులుగా వాడుకున్నదే తప్ప వారి సంక్షేమానికి ఇసుమంత సౌలభ్యాన్ని కూడా కలిగించలేదు. అప్పటి జనతాపార్టీ ప్రధానమంత్రి మురార్జీదేశాయ్ పార్లమెంటులో చేసిన ప్రకటన మేరకు మాజీ పార్లమెంటు సభ్యులు బి.పి. మండల్ అధ్యక్షతన వెనుకబడిన తరగతులు కమిషన్ వేశారు. ఈ కమిషన్‌లో ఆర్ఆర్ బోలె, దివాన్ మోహన్ లాల్, దీనబంధు సాహు, కె. సుబ్రహ్మణ్యం, యస్.యస్. గిల్ సభ్యులుగా వున్నారు. ఈ కమీషన్ మొత్తం 40 సిఫార్సులను చేసింది.

మండల్ కమీషన్ నివేదిక అమలు జరపకపోవడం వల్లే ఆనాడు కాంగ్రెస్‌కు బి.సి.లు దూరమయ్యారు. ఆ తరువాత జనతా పార్టీ ఏర్పడిన తరువాత మండల్ కమీషన్ నివేదికలోని కొన్ని అంశాలు అమలుపై ఏర్పడి వివాదం మూలంగా ప్రభుత్వానికి బీజేపీ ఎసరుపెట్టింది. జనసంఘ్ బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీగా (బీజేపీ) రూపొందింది. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రకటనలో మండల్ కమీషన్ ప్రస్తావన రాలేదు. బీజేపీ బీసీలంతా హిందువులే అని ప్రకటిస్తుంది. శూద్రులెవరు అనే గ్రంథంలో అంబేద్కర్ శూద్రులను ఈ వైదిక సమాజం, ఎలా బానిసలుగా చేసిందో - వేదాలు, బ్రాహ్మణాలు, ధర్మశాస్త్రాల ఆధారంగా నిరూపించారు. ఇవే భావాలు ఇప్పటికి ఆర్.ఎస్.ఎస్, విశ్వహిందూ పరిషత్, బి.జె.పి.కి ఉన్నాయి. నిజానికి అంబేద్కర్ దళితుల కోసమే కాదు, బహుజనుల కోసం, మైనార్టీలకోసం ఎంతో చేశాడు.

## సినిమా కథను తలపించే క్రైమ్ స్టోరీ




కడుపునొప్పితో భార్య చనిపోయిందంటూ అత్తమామలకు ఫోన్-వచ్చీ రాని మాటలతోనే తండ్రి దారుణాన్ని బయటపెట్టిన 6 ఏళ్ల కొడుకు!

సినిమా కథను తలపించే క్రైమ్ స్టోరీ ఒకటి తాజాగా ఉత్తర ప్రదేశ్‌లోని బండాలో బయటపడింది. కడుపునొప్పితో భార్య చనిపోయిందంటూ అత్తమామల వద్ద బుకాయించి తప్పించుకోవాలని చూశాడో భర్త. కానీ, అతని ఆరేళ్ల కుమారుడు వచ్చీ రాని మాటలతో తండ్రి దారుణాన్ని బయటపెట్టాడు. మరో వ్యక్తితో కలిసి తండ్రే తన తల్లిని చంపేశాడని చెప్పడంతో స్థానికులు షాకయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

యూపీలోని బండా జిల్లా , మంగస్ కా పుర్వా పరిధిలోని అలీయా గ్రామంలో శివ్ దేవీ, కిశోర్ కుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ప్రేమ్ (06), అతుల్ (04) ఉన్నారు. కిశోర్ కుమార్ స్థానికంగా పిండి గిర్నీ నడిపిస్తున్నాడు. అయితే, మద్యానికి బానిస అయిన కిశోర్ తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 24న మద్యం మత్తులో ఉన్న అతడు మరోసారి శివ్ దేవీతో ఘర్షణకు దిగాడు. చాలాసేపు భార్యతో గొడవపడిన కిశోర్ ఆ తర్వాత బయటకి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత మరో వ్యక్తితో కలిసి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇద్దరు కుమారులు ఇంట్లోనే ఉన్నారు. వారికి కిశోర్‌తో పాటు వచ్చిన ఆ వ్యక్తి చాక్లెట్ కొనుక్కోండి అని చిల్లర ఇచ్చి ఇంటి నుంచి బయటకు పంపించేశాడు. ఆ తర్వాత ఆ ఇద్దరు కలిసి శివ్ దేవీని బాత్రూంలోకి తీసుకెళ్లారు. అక్కడ గొంతు నులిమి చంపేశారు. ఆ తర్వాత కిశోర్ తన అత్తమామలకు శివ్ దేవీ కడుపునొప్పితో చనిపోయిందంటూ ఫోన్ చేశాడు.

అయితే, పిల్లలు అప్పటికే వారు చేసిన పనిని చూసేశారు. అల్లుడి ఫోన్‌కాల్‌తో అత్తమామలు, బంధువులు వెంటనే వారి ఇంటికి వచ్చారు. అప్పటికే ఆమె మృతదేహం బాత్రూంలో పడి ఉంది. పిల్లలు ఇద్దరు బోరున ఏడుస్తున్నారు. వారిని ఓ బంధువు దగ్గరికి తీసుకుని ఓదార్చారు. ఆ సమయంలో ఆరేళ్ల ప్రేమ్ తన తండ్రి ఘాతుకాన్ని బంధువుతో చెప్పాడు. దాంతో ఆ బంధువు అక్కడ గుమ్మిగూడిన జనం అందరి ముందు శివ్ దేవీని చంపింది కిశోరే అనే విషయాన్ని ప్రేమ్‌తో చెప్పించాడు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. బంధువుల సమాచారంతో అక్కడికి వచ్చిన పోలీసులు కిశోర్‌తో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని కటకటాల వెనక్కి నెట్టారు.

